



సీఎం సభకు వెళ్లకుండా ఆటోల్లో ఉండిపోయిన జనం

# బరిలో నిలిచేది వీరే!

## ముగిసిన నామినేషన్ల ఘట్టం
## అనకాపల్లి లోక్‌సభ స్థానానికి 15 మంది పోటీ

- జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలకు బరిలో 68 మంది
- అన్నిచోట్ల కూటమి, వైసీపీ మధ్యే పోరు



| అనకాపల్లి లోక్‌సభ స్థానం | | నర్సీపట్నం అసెంబ్లీ సెగ్మెంట్ | | పాయకరావుపేట | | చోడవరం | |
|---|---|---|---|---|---|---|---|
| సీఎం రమేశ్ (కూటమి అభ్యర్థి) | బూడి ముత్యాల నాయుడు (వైసీపీ) | అయ్యన్నపాత్రుడు (టీడీపీ) | పెట్ల ఉమాశంకర్ గణేశ్ (వైసీపీ) | వంగలపూడి అనిత (టీడీపీ) | కంబాల జోగులు (వైసీపీ) | కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ) | కరణం ధర్మశ్రీ (వైసీపీ) |



| మాడుగుల | | అనకాపల్లి | | ఎలమంచిలి | | పెందుర్తి | |
|---|---|---|---|---|---|---|---|
| బండారు సత్యనారాయణ మూర్తి (టీడీపీ) | ఈర్లె అనురాధ (వైసీపీ) | కొణతాల రామకృష్ణ (జనసేన) | మలసాల భరత్ (వైసీపీ) | సుందరపు విజయ కుమార్ (జనసేన) | కన్నబాబురాజు (వైసీపీ) | పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన) | అన్నంరెడ్డి అదీప్‌రాజు (వైసీపీ) |

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

**సార్వత్రిక ఎన్నికల పోరులో నిలిచేదెవరో తేలిపోయింది. అనకాపల్లి జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీలో ఉండేవారు ఎవరనేదానిపై స్పష్టత వచ్చింది. సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. బరిలో నిలిచే అభ్యర్థులను అధికారులు ప్రకటించారు. వీరికి గుర్తులను కూడా కేటాయించారు. ఎన్నికల బరిలో అనేక రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఉన్నప్పటికీ ఈసారి ప్రధాన పోటీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే ఉండనుంది.**

### అనకాపల్లి లోక్‌సభ బరిలో 15 మంది...

అనకాపల్లి లోక్‌సభ స్థానానికి 22 నామినేషన్లు ఆమోదం పొందగా, ఇందులో ఏడుగురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 15 మంది ఎన్నికల బరిలో నిలిచారు. అలాగే జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు 94 నామినేషన్లు ఆమోదం పొందగా, ఇందులో 26 మంది ఉపసంహరించుకున్నారు. 68 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అధికంగా 14 మంది పోటీ పడుతుండగా, చోడవరం నుంచి అత్యల్పంగా ఆరుగురు పోటీలో నిలిచారు. కాగా లోక్‌సభ స్థానానికి పోటీ పడుతున్న బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్, వైసీపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మధ్యే గట్టి పోటీ ఉంది.

### ఏడు అసెంబ్లీ స్థానాల్లో 68 మంది...

జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 68 మంది పోటీలో ఉన్నారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి 12 నామినేషన్లు ఆమోదం పొందగా, ఎవరూ ఉపసంహరించుకోలేదు. నర్సీపట్నం నియోజకవర్గానికి ఎనిమిది నామినేషన్లు ఆమోదం పొందగా, ఒక్కరు కూడా ఉపసంహరించుకోలేదు. చోడవరం నియోజకవర్గానికి 13 నామినేషన్లు ఆమోదం పొందగా, ఏడుగురు ఉపసంహరించుకున్నారు. దీంతో ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మాడుగుల నియోజకవర్గం నుంచి 11 నామినేషన్లు ఆమోదం పొందగా, ఇద్దరు ఉపసంహరించుకున్నారు. దీంతో 9 మంది అభ్యర్థులు మిగిలారు. ఎలమంచిలి నియోజకవర్గానికి 14 నామినేషన్లు ఆమోదం పొందగా, నలుగురు ఉపసంహరించుకున్నారు. 10 మంది పోటీలో నిలిచారు. పాయకరావుపేట(ఎస్సీ) నియోజకవర్గానికి 17 నామినేషన్లు ఆమోదం పొందగా, ఎనిమిది మంది ఉపసంహరించుకున్నారు. దీంతో 9 మంది పోటీలో నిలిచారు. పెందుర్తిలో నలుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 14 మంది పోటీలో ఉన్నారు. పంచకర్ల ... మిగతా 8వ పేజీలో

# పేలవంగా జగన్ సభ

## స్థానిక సమస్యల ప్రస్తావన, ఎటువంటి భరోసా ఇవ్వకుండా సాగిన ప్రసంగం



మాట్లాడుతున్న సీఎం జగన్



సభ జరుగుతుండగానే వెళ్లిపోతున్న జనం

- చంద్రబాబుపై విమర్శలు, తాము అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని బెదిరింపు
- గోవాడ షుగర్స్, సాగునీటి వనరుల అభివృద్ధి ఊసేలేదు
- నిరాశ చెందిన రైతాంగం
- దుకాణాలను మూసివేయించడంతో వ్యాపారులు గగ్గోలు
- రోడ్డుపైనే సభ కారణంగా ప్రయాణికులు, వాహనచోదకులకు కష్టాలు



ప్రధాన రహదారిపై మూసి వేయించిన దుకాణాలు

చోడవరం, ఏప్రిల్ 29:

**జిల్లాలో వెనుకబాటుతనం, వ్యవసాయమే జీవనాధారంగా బతికే ప్రజలు ఉన్న చోడవరం, మాడుగుల ప్రాంతాలకు ఏం చేస్తామనే హామీ గానీ, ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఏం చేస్తామనే భరోసా గానీ ఇవ్వకుండానే చోడవరంలో సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ చప్పగా ముగిసిపోయింది. సోమవారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో నిర్వహించిన రోడ్‌షో ప్రచార సభ కేవలం ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను విమర్శించడమే లక్ష్యంగా కొనసాగిన తీరు సభకు హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది.**

సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ కావడంతో ఈ రెండు నియోజకవర్గాలకు ఏమైనా వరాలు ప్రకటిస్తారా? అనే ఆశ అందరిలో నెలకొంది. ప్రత్యేకించి నాడు పాదయాత్ర సందర్భంగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రూ.100 కోట్లతో అభివృద్ధి చేస్తామని, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఉన్నందున గోవాడ భవితవ్యంపై ఏదైనా మాట్లాడతారని రైతాంగం అంతా ఆసక్తిగా ఎదురుచూసింది. అయితే టీడీపీ హయాంలో దెబ్బతిన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని తమ హయాంలో బాగు చేశామని చెప్పి ఊరుకున్నారు తప్పితే ఫ్యాక్టరీని ఏ విధంగా బాగు చేశారో చెప్పకుండా, ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుపైనా మాట్లాడకుండానే దాటవేసి వెళ్లిన తీరు విమర్శలకు తావిచ్చింది. వాస్తవానికి వైసీపీ హయాంలో షుగర్స్ రైతుల బకాయిలకు డబ్బులు మంజూరు చేయడం తప్పితే, ఫ్యాక్టరీని గాడిలో పెట్టే చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయి. కమిటీలతో కాలయాపన తప్పితే, గోవాడలో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు అంశం పూర్తిగా మరిచిపోయారు. చెరకు రైతులకు బకాయిలు ఇవ్వలేని గోవాడ.. వచ్చే ఏడాది కొనసాగేది కూడా సందేహంగానే మారింది. ఇటువంటి పరిస్థితుల్లో ... మిగతా 8వ పేజీలో

# మైదానం కాదు.. చెరువే..

## పూర్తిగా ఎండిపోతున్న చెరువులు

- సాగునీటి వనరుల సంరక్షణ లేక, వర్షాలు పడక ఈ దుస్థితి



ఎండిపోయిన రొంగలిపాలెం చెరువు

**రోలుగుంట, ఏప్రిల్ 29:** మండలంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఏడు నెలలుగా తగిన వర్షాలు లేక చెరువులు, కాలువలు ఎండిపోతున్నాయి. దీని వల్ల గ్రామాల్లో ఉన్న చెరువులన్నీ పూర్తిగా బీళ్లుగా మారాయి.

గతంలో రెండు, మూడేళ్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా అవ, చెరువుల్లో కొంతమేరకు నీరుండడం వల్ల కరువు కనిపించేది కాదు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి చెరువులు, కుంటలు ఉన్నాయి. అయితే చెరువుల్లో పూడికలు తీయించడానికి, ఆక్ర మణలను అరికట్టడానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో చెరువులు మైదానాలను తలపిస్తున్నాయి. గత రెండు నెలల నుంచి ఎండలు విపరీతంగా కాస్తుండడంతో చెరువుల్లో ఉన్న కొద్దిపాటి చెలమలు కూడా పూర్తిగా ఎండిపోయాయి. మండలంలోని దాదాపు 150కు పైగా చిన్న, పెద్ద ఉన్న చెరువులు పూర్తిగా చుక్క నీరు లేకుండా పూర్తిగా ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. దీనికి తోడు బోర్ల నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎండుతున్న పంటలు

ప్రస్తుతం చెరువుల్లో చుక్కనీరు లేకపోవడం వల్ల ఆయకట్టు భూముల్లో సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయి. అవ, చెరువు ఆయకట్టు దిగువన రైతులు వేసవి పంటలను ప్రతీ ఏటా సాగుచేసేవారు. అయితే ఈ ఏడాది మాత్రం ఎటువంటి పంటలు పండించడానికి ఆస్కారం లేకుండా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



# బెల్లం మార్కెట్ డీలా

## భారీగా పడిపోయిన దిగుమతి

- జిల్లాలో తగ్గిన చెరకు విస్తీర్ణం
- షుగర్ ఫ్యాక్టరీలు మూతపడడం, బెల్లం తయారీ లాభసాటిగా లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు వేస్తున్న రైతులు
- బెల్లం రైతులను ఆదుకుంటామని పాదయాత్ర సమయంలో జగన్ హామీ
- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం



అరకొరగా ప్లాట్‌ఫారంపై ఉన్న బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29:

**దేశంలోనే అతి పెద్ద బెల్లం మార్కెట్‌గా పేరొందిన అనకాపల్లి మార్కెట్ నేడు వెలవెలబోతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో ఏటా చెరకు పంట విస్తీర్ణం తగ్గిపోయి బెల్లం దిగుమతులు పడిపోయాయి. తమది రైతు సంక్షేమ ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ.. చెరకు రైతులకు చేసిందేమీ లేదని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2018-19 సీజన్‌లో అనకాపల్లి మార్కెట్‌కు 22,23,746 బెల్లం దిమ్మలు రాగా, 2023-24 సంవత్సరం సీజన్‌లో 7,52,457 దిమ్మలు మాత్రమే దిగుమతి అయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్లం రైతులను ఆదుకుంటామని గత ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక మరిచిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

సీజన్ వారీగా బెల్లం దిమ్మల దిగుమతి, కమిటీకి వచ్చిన ఆదాయ వివరాలు

| సీజన్ | దిమ్మలు | కమిటీకి ఆదాయం |
|---|---|---|
| 2018-19 | 22,23,746 | 91.08 లక్షలు |
| 2019-20 | 16,86,458 | 78.74 లక్షలు |
| 2020-21 | 16,64,840 | 77.53 లక్షలు |
| 2021-22 | 14,21,277 | 83.40 లక్షలు |
| 2022-23 | 9,99,475 | 47.51 లక్షలు |
| 2023-24 | 7,52,457 | 42.12 లక్షలు |



ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫారాలు

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం వల్ల జిల్లాలో చెరకు పంట విస్తీర్ణం తగ్గిపోతోంది. 2018-19 సీజన్‌లో జిల్లాలో 31,514 హెక్టార్లల్లో రైతులు చెరకును పండించే వారు. ప్రస్తుతం ఈ పంట 8,450 హెక్టార్లకు పడిపోయింది. ప్రభుత్వం ప్రోత్సహించకపోవడం, చెరకుకు తెగుళ్లు సోకడంతో పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు చెరకు పంట వేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

దీనికి తోడు బెల్లం ధరలు కూడా ఆశాజనకంగా లేవు. పండిన చెరకును చక్కెర కర్మాగారాలకు రవాణా చేయాలనుకుంటే ఇటు తుమ్మపాల, అటు ఏటికొప్పాక, తాండవ చక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. గోవాడ చక్కెర కర్మాగారం ఒకప్పుడు ఐదు లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగా, ప్రస్తుతం రెండు లక్షలకే పరిమితమైంది. టన్ను చెరకుతో బెల్లం తయారు చేస్తే వంద కి లోల బెల్లం వస్తుంది. అయితే దీనికి అయ్యే ఖర్చు సుమారు రెండు వేల రూపాయల వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌కు ఈ బెల్లాన్ని రవాణా చేస్తే వంద కిలోలకు రూ.3,400లు నుంచి రూ.3,600లు వరకు వస్తుంది. ఖర్చులు పోను ఏడాదిలో కేవలం రూ.1500 నుంచి రూ.2000 వేలు వరకు మాత్రమే ఆదాయం లభించడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో చెరకు పంట దిగుబడులు బాగా పడిపోవడంతో రైతులు సరుగుడు, యూకలిప్టస్ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. అనకాపల్లి మార్కెట్‌కు చోడవరం, మాడుగుల, ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి రైతులు బెల్లాన్ని అధికంగా దిగుమతి చేసేవారు. ప్రస్తుతం ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గ ప్రాంతాల నుంచే ఎక్కువగా బెల్లం దిగుమతి అవుతోంది. మార్కెట్‌కు ఐదేళ్ల క్రితం రోజుకి 12 నుంచి 15 వేల దిమ్మలు వరకు దిగుమతి అయ్యేవి. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం రెండు రోజుల మార్కెట్‌కు సుమారు 25 వేల దిమ్మలు వరకు దిగుమతి అయ్యేవి. ఈ ఐదేళ్ల కాలం నుంచి చూస్తే ఒక రోజులో పది వేల దిమ్మల దిగుమతి దాటిన దాఖలాలు లేవు. రెండు రోజుల మార్కెట్ కూడా 15వేల లోపు బెల్లం దిమ్మలు దిగమతి అయ్యేవి. ఈ కారణంగా అటు రైతులతో పాటు వేతనం గిట్టుబాటు కాక ఇటు కొలగార్లు, కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

## జన కేతనం

- భలే రికార్డు
- చట్టం...చట్రం
- ఎలమంచిలిలో టీడీపీకి ఆదరణ

... వార్తలు 7వ పేజీలో

# జిల్లాలో 67,420 మంది ఇంటికే పింఛన్లు

- మొత్తం సామాజిక పింఛన్ల లబ్ధిదారులు 2,65,210 మంది
- బ్యాంకు ఖాతాల్లో 1,97,790 మందికి పింఛన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయం

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29:

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలోని పింఛన్లను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) పద్ధతి ద్వారా మే, జూన్ నెలల్లో పింఛన్ల పంపిణీ డీఆర్‌డీఏ పీడీ శచీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండు లక్షల 65వేల 210 మంది పింఛన్‌దారులు ఉండగా, లక్షా 97వేల 790 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో మే ఒకటో తేదీన నగదు జమ అవుతుందన్నారు.

దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మంచానికే పరిమితమైన వారికి, వీల్‌ఛైర్‌లో ఉన్న వారికి, డీబీటీ పేమెంట్ రిజక్ట్ అయిన వారంతా కలిపి 67వేల 420 మంది పింఛన్‌దారులు ఉండగా, వీరందరికీ పిం ఛన్ల సొమ్మును ఇంటి వద్దకే పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. పింఛన్‌దారులు ఎవరూ సచివాలయాలకు రానవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

## ఎవరు గెలిచినా మీదే గెలుపు

### జిల్లా స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ..............................................................

డోరు నెంబరు : ........................................ వీధి పేరు : ........................................

గ్రామం/పట్టణం : ........................................ మండలం : ........................................

జిల్లా : ........................................ పోస్టల్ పిన్‌కోడ్ : ....................ఫోన్ నెం. ....................

విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

| నియోజకవర్గం పేరు | NDA కూటమి | YSRCP | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| 1. భీమిలి | | | | |
| 2. విశాఖ తూర్పు | | | | |
| 3. విశాఖ పశ్చిమ | | | | |
| 4. విశాఖ ఉత్తరం | | | | |
| 5. విశాఖ దక్షిణం | | | | |
| 6. గాజువాక | | | | |
| 7. పెందుర్తి | | | | |
| 8. అనకాపల్లి | | | | |
| 9. యలమంచిలి | | | | |
| 10. పాయకరావుపేట | | | | |
| 11. నర్సీపట్నం | | | | |
| 12. చోడవరం | | | | |
| 13. మాడుగుల | | | | |
| 14. పాడేరు | | | | |
| 15. అరకు | | | | |
| మొత్తం : | | | | |

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : పోర్టు హాస్పిటల్ ఎదురుగా, ఎన్.హెచ్.16, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530016.



ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బండారు, సీఎం రమేశ్‌కు పైలా సంఘీభావం

## నారా లోకేశ్ హామీతో వెనక్కి తగ్గిన 'పైలా'

- స్వతంత్ర అభ్యర్థిగా వేసిన నామినేషన్ ఉపసంహరణ
- కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేస్తానని హామీ

**చీడికాడ, ఏప్రిల్ 29 :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీతో ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు, మాడుగుల అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పైలా ప్రసాదరావు వెనక్కితగ్గారు. దీంతో సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని, కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తానని స్పష్టం చేశారు. తొలుత మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం పైలా పేరును ప్రకటించింది. అనివార్య కారణాల వల్ల అతనిని తప్పించి, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిపింది. దీనిపై మనస్థాపానికి గురైన పైలా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తిలు పైలా ప్రసాదరావు నివాసానికి వెళ్లి మాట్లాడారు. ఈ విషయాన్ని నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన పైలాతో మాట్లాడడంతో సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అంతేకాకుండా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, రెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ ఓటింగ్‌కు నాలుగైదు బృందాలు

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

**అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29:** జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో హోమ్ ఓటింగ్‌కు ప్రతీ నియోజకవర్గానికి నాలుగు నుంచి ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క బృందంలో ఒక ఏపీవో, ముగ్గురు ఓపీవో, ఒక పోలీస్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు శిక్షణ ఇస్తామన్నారు. మే మూడో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు హోమ్ ఓటింగ్ జరిపేందుకు నిర్ణయించినట్టు కలెక్టర్ తెలిపారు. ప్రతీ ఆర్వో వద్ద పోస్టల్ ఓట్ సెంటర్‌ను, ఫెసిలిలేటెడ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ ఫెసిలిలేటెడ్ సెంటర్‌కు ఒక నోడల్ అధికారిగా ఏఆర్‌ఓపీబీ ఉంటారన్నారు. ప్రతీ బూత్ నుంచి వన్ ప్లస్ త్రీ సిబ్బంది ఉంటారన్నారు. మే ఆరో తేదీ నుంచి ఎనిమిదవ తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు ఈ ఫెసిలిలేటెడ్ సెంటర్లు నడపబడతాయన్నారు. అన్ని రకాల పోస్టల్ ఓటింగ్ మే ఎనిమిదవ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు.

## సామాజిక న్యాయమే జనసేన ధ్యేయం

**బలిజ, ఒంటరి జేఏసీ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు దాసరి రాము**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాసరి రాము, ఇతర నేతలు

**ఎలమంచిలి, ఏప్రిల్ 29:** అందరికీ సామాజిక న్యాయం అందించడమే ధ్యేయంగా జనసేన పార్టీని పవన్ కల్యాణ్ స్థాపించారని బలిజ, ఒంటరి జేఏసీ ఉమ్మడి రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు దాసరి రాము అన్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ అన్ని వర్గాల వారిని ఒక తాటిపైకి తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధిని సాగించేలా చేయడమే లక్ష్యంగా ఉన్నారన్నారు. కూటమి పార్టీల కలయికతో ఎనలేని అభివృద్ధి సాగుతుందన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున పోటీ చేసే సుందరపు విజయ్‌కుమార్ గత 13 ఏళ్లుగా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. విజయ్‌కుమార్‌తోపాటు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌లను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు డొక్కా నాగభూషణం, రాష్ట్ర కాపు నాయకుడు గుర్రాల శ్రీనివాస్, సునీల్ నాయుడు, స్థానిక నేతలు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, నక్కా శివశంకర్ పాల్గొన్నారు.

## నెల పండగ ఘటాల ఊరేగింపు

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29:** ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతిగాంచిన నూకాంబిక అమ్మవారి నెల పండగ ఘటాల ఊరేగింపు సోమవారం రాత్రి ప్రారంభమైంది. బాలాలయంలో అమ్మవారి ముందు ఘటాలను పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపును ప్రారంభించారు. మే ఏడో తేదీన అమ్మవారి నెల పండగ సందర్భంగా పండగకు తొమ్మిది రోజులు ముందు ఘటాల ఊరేగింపు నిర్వహించి నెల పండగ విశిష్టతను ప్రజలకు తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

# నాడు ఆహ్లాదం.. నేడు కళావిహీనం..!

ఇదీ నాతవరంలోని 'మన ఊరి ఉద్యానవనం' దుస్థితి

- 2018లో రూ.పది లక్షలతో ఏర్పాటు
- రెండేళ్లుగా నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ప్రజాధనం వృథాపై గ్రామస్థులు ఆగ్రహం



ఉద్యానవనంలో సిమెంట్ బెంచీల ముందు వెలసిన పుట్టలు




నాతవరంలో మన ఊరి ఉద్యానవనం

**నాతవరం, ఏప్రిల్ 29:** మండల కేంద్రం నాతవరంలో గల 'మన ఊరి ఉద్యానవనం' అధ్వానంగా మారింది. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాకర వాతావరణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ పార్కుపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకోవడంతో నేడు కళావిహీనంగా మారింది. ఇక్కడి పీహెచ్‌సీ భవనం వెనుక ప్రాంతంలో పిచ్చి మొక్కలు నిండి ఉండడంతో 2018లో అప్పటి జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతంలో ఉద్యానవనం ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా పది లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేశారు. దీంతో ఉద్యానవనం ఏర్పాటు చేయగా, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ప్రారంభించారు. కొంతకాలం పాటు బాగానే ఉన్నా.. రెండేళ్ల నుంచి ఈ ఉద్యానవనం నిర్వహణను గాలికి వదిలేశారు. కనీసం పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ఇది కళావిహీనంగా మారింది. ఈ ఉద్యానవనం ముందర చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే ఇందులో ఉన్న కొన్ని చెట్లు ఎండలకు ఎండిపోయాయి. ఇక్కడున్న సిమెంటు బెంచీల ముందర ప్రస్తుతం పుట్టలు వెలిశాయి. పది లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసిన అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వదిలేయడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈ ఉద్యానవనంలో పచ్చదనం పరిడవిల్లేదని, అటువంటి సమయంలో కొందరు వచ్చి ఇక్కడ ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు సేదదీరేవారని అంటున్నారు. కానీ ఇప్పుడు ఇది కళావిహీనంగా మారడంతో ఎవరూ రావడం లేదని చెపుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ ఉద్యానవనం నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించేలా చర్యలు చేపట్టాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ప్రవేశ ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



ఎండలకు ఎండిపోయిన చెట్లు

## భలే ఐడియా బాసూ..

భానుడు ఉగ్రరూపం చూపుతుండడంతో జనం రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. వివిధ పనులపై ఇళ్లను నుంచి బయటకు వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే మిట్ట మధ్యాహ్నం వేళ విధులు చేపట్టాల్సి ఉన్న ఓ పోస్టల్ ఉద్యోగి కాస్త వెరైటీగా ప్లాన్ చేశారు. చోడవరంలో పోస్టుమేన్‌గా పనిచేస్తున్న మాన్యం భాస్కర్ ఎండవేడిని తట్టుకునేందుకు వీలుగా తన స్కూటీ వాహనం పైభాగంలో టాప్ ఏర్పాటు చేయించారు. దానిపై చల్లగా ఉండేందుకు ఆకులు, వాటి మధ్య అక్కడక్కడా ఎర్రని కాగితపు పువ్వులను అలంకరించారు. ఇప్పుడు ఈ వాహనం రోడ్డుపై వెళుతుంటే పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - చోడవరం



స్కూటీ వాహనంపై టాప్ ఏర్పాటు చేసి ఆకులు, పువ్వులను అలంకరించిన పోస్టమాన్

## ఉపాధి పథకాన్ని భ్రష్టుపట్టించిన జగన్

- కూటమి గెలిస్తే ఉపాధి పథకానికి మెరుగులు
- అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

**సబ్బవరం, ఏప్రిల్ 29:** రాష్ట్రంలో ఉపాధి పథకాన్ని కూడా సీఎం జగన్ భ్రష్టుపట్టించారని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని మొగలిపురంలో ఆయన టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుతో కలసి ఉపాధి కూలీలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు కల్పించాల్సిన సదుపాయాలను రాష్ట్రప్రభుత్వం కల్పించలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ నిధులను దుర్వినియోగం చేసి ఇంటింటికీ కొళాయిల పథకాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని విమర్శించారు. కూటమి విజయం సాధిస్తే ఉపాధి పథకానికి మరింత మెరుగులు దిద్ది కూలీలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నదులు అనుసందానంలో భాగంగా మొగలిపురం మీదుగా కాలువ రాకుండా ఎలైన్‌మెంట్ మారేలా చర్యలు తీసుకుంటానని సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనకు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుకు గాజుగ్లాసు గుర్తుపైన ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేయడమే కాకుండా పేదలకు రెండు సెంట్లు స్థలంలో ఇళ్లు కట్టిఇచ్చే విధంగా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని చెప్పారు. గండి బాబ్జీ మాట్లాడుతూ.. వైసీపీ కల్లిబొల్లి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, గండి దేముడు, ముత్యాలనాయుడు, ఎం.మహాలక్ష్మీనాయుడు, బీఏ రావు, వనం సత్యనారాయణ, రెడ్డి రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

## గెడ్డం బుజ్జిని పరామర్శించిన అనిత

**పాయకరావుపేట, ఏప్రిల్ 29 :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సోమవారం పరామర్శించారు. విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గెడ్డం బుజ్జిని ఆమె కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట టీడీపీ పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం ఉన్నారు.



ఆస్పత్రిలో బుజ్జితో మాట్లాడుతున్న అనిత

## క్రైం... crime news

## గాయపడిన యువకుడు మృతి

**నక్కపల్లి, ఏప్రిల్ 29:** ఈనెల 24న గొడిచెర్ల హైవే జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువకుడు సోమవారం మృతి చెందారు. మండలంలోని రేబాక గ్రామానికి చెందిన ఎస్.రమేశ్, ఎస్.పొట్టియ్య పాయకరావుపేట మండలంలో డెక్కన్ కంపెనీలో పని ముగించుకుని రేబాక బైక్‌పై వస్తుండగా గొడిచెర్ల హైవే వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు.అదే రోజు ఎస్.రమేశ్ మృతి చెందగా, తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సాధిరెడ్డి పొట్టియ్య (26) సోమవారం మృతి చెందినట్టు నక్కపల్లి పోలీసులు చెప్పారు.

## చికిత్స పొందుతూ మరొకరు..

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29:** రోడ్డు ప్రమాదంలో గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్టు రూరల్ హెచ్‌సీ రాజు తెలిపారు. దిబ్బపాలెం గ్రామానికి చెందిన ఎస్.వెంకట రామారావు ఈ నెల 21న బైక్‌పై అనకాపల్లికి వచ్చి తిరిగి గ్రామానికి వెళుతున్న సమయంలో తాతమ్మ మదుంపై వాహనం అదుపుతప్పి పడిపోవడంతో గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మృతుని సోదరుడు లీలా వెంకట సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ రాజు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

**నక్కపల్లి, ఏప్రిల్ 29:** స్థానిక ఉపమాక హైవే జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మన్యం పార్వతీపురం జిల్లా పాలకొండ నుంచి ఈగల గోపి,భార్య రేవతి, రెండేళ్ల పాప హేమవర్షిణితో కలిసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు బైక్‌పై వెడుతుండగా ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బైక్ ఉపమాక హైవే జంక్షన్‌కు వచ్చేసరికి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో ఈగల గోపి, అతని కుమార్తె హేమ వర్షిణి తీవ్రంగా గాయపడగా, మరో బైక్‌పై వున్న అడ్డరోడ్డుకు చెందిన మోటారి కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరికి నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

## రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు..

**చీడికాడ, ఏప్రిల్ 29:** మండలంలోని అర్జునగిరి రోడ్డు మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు తగిలాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. సోమవారం మధ్యాహ్నం ఎస్ఎన్‌పురం గ్రామానికి చెందిన చందు అనే వ్యక్తి తురువోలు మీదుగా అర్జునగిరి బైక్‌పై వస్తుండగా, దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన పుట్టా సామయ్య, బుగతా చినఅప్పలనాయుడు చోడవరం నుంచి అర్జునగిరి మీదుగా టీవీఎస్ వాహనంపై వస్తున్నారు. ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఈ ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో చోడవరంలో సీఎం జగన్ ఎన్నికల ప్రచారం అనంతరం అర్జునగిరి వైపు వస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఈ సంఘటనను చూసి 108కు ఫోన్ చేశారు. వెంటనే సదరు సిబ్బంది వచ్చి క్షతగాత్రులను చోడవరం ఆస్పత్రికి తరలించారు.

## ఇండిపెండెంట్‌ను నిర్బంధించిన సీఐ

**నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి.. ఆర్వోకు బాధితుడి ఫిర్యాదు**

**విచారణ అనంతరం సీఐపై సీపీ సస్పెన్షన్ వేటు**



**విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** విశాఖ నగర పరిధిలోని మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసినాయుడును పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం సస్పెండ్ చేశారు. పశ్చిమ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కొయిలాడ వెంకట జగదీశ్వరరావు అనే రౌడీషీటర్ నామినేషన్ వేశారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. ఈనెల 28న మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు జగదీశ్వరరావు హాజరయ్యాడు. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన రౌడీషీటర్లు అందరినీ ఇంటికి పంపించేసిన సీఐ సన్యాసినాయుడు ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన జగదీశ్వరరావును మాత్రం స్టేషన్‌లోని మొదటి అంతస్తుకు తీసుకువెళ్లి రెండున్నర గంటలపాటు నిర్బంధించారు. నామినేషన్‌ను వెనక్కి తీసుకోవాలంటూ అసభ్య పదజాలంతో దూషించి ఇబ్బందులకు గురిచేశారు. దీంతో జగదీశ్ స్టేషన్ మొదటి అంతస్థు నుంచి కిందికి దూకి పారిపోయేందుకు యత్నించగా సిబ్బంది పట్టుకున్నారు. ఇంటికి తీసుకువెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. జగదీశ్వరరావు శరీరంపై గాయాలు ఉండడంతో కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తీసుకువెళ్లి ఎంఎల్‌సీ కేటగిరీలో చేర్పించి చికిత్స చేయించారు. సీఐ తన పట్ల వ్యవహరించిన తీరుపై ఆధారాలతో బాధితుడు జగదీశ్వరరావు పశ్చిమ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తిని ఆదేశించారు. విషయం సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ దృష్టికి చేరడంతో సీఐ సన్యాసినాయుడును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సస్పెన్షన్ సమయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నగరాన్ని విడిచి బయటకు వెళ్లడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
| --- | --- |
| రైతు ధర | 120.00 |
| లైవ్ ధర | 140.00 |
| విత్ స్కిన్ | 250.00 |
| స్కిన్ లెస్ | 260.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
| --- | --- |
| విశాఖపట్నం | 400 |
| విజయనగరం | 404 |
| శ్రీకాకుళం | 404 |



# ఐఏఎస్ అధికారికి గ్రేటర్ నజరానా!

## నగరంలో ఆయన భార్య పేరిట ఉన్న భవనాన్ని గెస్ట్ హౌస్ కింద అద్దెకు తీసుకున్న జీవీఎంసీ

- నెలకు రూ.లక్షల్లో చెల్లింపులు.. సర్వత్రా విమర్శలు
- సదరు అధికారికి ప్రయోజనం కల్పించేందుకే..
- పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు స్థానిక అధికారుల నిర్ణయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎప్పుడొస్తారో...ఒకవేళ వచ్చినా సరే అక్కడ బస చేస్తారో లేదో గ్యారంటీ కూడా లేదు. అయినా అతిథుల కోసమంటూ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) అధికారులు ఒక భవనాన్ని గెస్ట్‌హౌస్ పేరుతో అద్దెకు తీసుకుని నెలకు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. ఒకవేళ గెస్ట్‌హౌస్ కోసం భవనం అద్దెకు తీసుకోవాలనుకుంటే టెండర్ ప్రకటన ఇవ్వాలి. కానీ, అధికారులు మాత్రం ఎందుకనో రహస్యంగా తతంగం నడిపించారు. ఇదంతా ఒక ఐఏఎస్ అధికారికి లబ్ధి చేకూర్చేందుకేనని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ పనులు, సమీక్షలు, సమావేశాల కోసం కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు నగరానికి వస్తే స్టార్ హోటళ్లలో బస చేస్తుంటారు. వారికి సంబంధించిన వసతి, భోజనం, రవాణా ఖర్చులను జీవీఎంసీయే భరిస్తుంది. అలాంటి అతిథులు నగరానికి రావడం అరుదనే చెప్పుకోవాలి. వారు నోవాటెల్, గేట్‌వే, గ్రాండ్‌బే, రాడిసన్‌బ్లూ వంటి స్టార్ హోటళ్లలో బస చేసినా ఖర్చు గరిష్ఠంగా నెలకు రూ.లక్షకు మించదు. కానీ, అతిథుల కోసమంటూ జీవీఎంసీ అధికారులు నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు సిద్ధమై ఒక భవనాన్ని గెస్ట్ హౌస్‌గా తీసుకున్నారు.

### అసలు ఏం జరిగిందంటే...

రాష్ట్ర రాజధానిలో కీలక పోస్టులో ఉన్న ఒక ఐఏఎస్ అధికారికి నగరంలోని విశాలాక్షి నగర్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. కొద్దినెలల కిందటే దీని నిర్మాణం పూర్తయ్యింది. ఒక్కో అంతస్థు 1,750 చదరపు అడుగులు చొప్పున, ఐదు అంతస్థులు కలిపి 8,500 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. దీనికి రెసిడెన్షియల్ కేటగిరీ కింద జీవీఎంసీ రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను విధించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఖాళీగా ఉండిపోవడంతో ఆ భవనాన్ని జీవీఎంసీ అవసరాల కోసం అద్దెకు తీసుకునేలా చూడాలని సదరు ఐఏఎస్ అధికారి...మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో చక్రం తిప్పుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి ద్వారా జీవీఎంసీ అధికారికి చెప్పించినట్టు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడమే తరువాయి అన్నట్టు జీవీఎంసీ అధికారి విశాలాక్షి నగర్‌లో ఐఏఎస్ అధికారి భార్య పేరిట ఉన్న ఐదంతస్థుల భవనాన్ని నగర పాలక సంస్థ అవసరాల కోసం గెస్ట్‌హౌస్‌గా తీసుకోవాలని నిర్ణయించేశారు. నెలకు రూ.20 లక్షలు అద్దె చెల్లించడంతో పాటు కరెంట్ బిల్లు, అక్కడ పనిచేయడానికి సిబ్బంది నియామకం కూడా జీవీఎంసీయే భరించేలా ఒప్పందం చేసుకున్నట్టు విపక్షాలు ఆరోపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏదైనా రెసిడెన్సియల్ భవనాన్ని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకోవాలనుకుంటే చదరపు అడుగుకు గరిష్ఠంగా రూ.20 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. అంతకుమించి చెల్లించాల్సి వస్తే కౌన్సిల్ నుంచి ప్రత్యేక అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ అవేమీ పాటించకుండా నెలకు రూ.లక్షల్లో అద్దె చెల్లించేందుకు జీవీఎంసీ అధికారి నిర్ణయం తీసేసుకున్నారు. ఇక ఒప్పందం జరిగి నాలుగు నెలలు గడిచినా నగరానికి వచ్చిన అతిథి ఒక్కరు కూడా ఆ భవనంలో బస చేసిన దాఖలాలు లేవు. అయినాసరే విస్కో నుంచి ప్రతి నెలా అద్దె చెల్లింపు మాత్రం జరిగిపోతోంది. ఒకవేళ జీవీఎంసీకి వచ్చిన అతిథులకు స్టార్ హోటల్‌లో వసతి కల్పించినా గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దెలో పది శాతానికి మించి ఖర్చయ్యే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదిలావుండగా అధికారులు మాత్రం జీవీఎంసీ పనుల మీద నగరానికి వచ్చే అతిథులు బస చేయాల్సి వస్తే ఒక గెస్ట్‌హౌస్ ఉండాలనే ఉద్దేశంతోనే ఆ భవనాన్ని అద్దెకు తీసుకున్నామని సమర్థించుకుంటున్నారు. అలాగే గెస్ట్‌హౌస్‌కు చెల్లించే అద్దె కూడా రూ.20 లక్షలు కాదని, కేవలం రూ.2.1 లక్షలు మాత్రమేనని చెబుతున్నారు. కానీ అందుకు సంబంధించిన అధికారిక వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. గెస్ట్‌హౌస్ వ్యవహారాన్ని విపక్ష కార్పొరేటర్లు బయటపెట్టడంతో ఉలిక్కిపడిన జీవీఎంసీ అధికారి జరిగిన తప్పును సరిదిద్దుకోవడంపై దృష్టిపెట్టకుండా, ఆ సమాచారం బయటకు ఎలా వెళ్లిందనే దానిపై నీటి సరఫరా, విస్కో, రెవెన్యూ విభాగం అధికారులను పిలిచి ఆరా తీస్తున్నట్టు తెలిసింది.



**ఎలమంచిలి నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,04,073 |
| పురుషులు | 99,340 |
| మహిళలు | 1,04,724 |
| ఇతరులు | 9 |

## ఓటరు మాట

### ఉచితాలు కాదు...ఉపాధి కావాలి



ప్రభుత్వ అసమర్థతతో నిరుద్యోగం పెరిగిపోయింది. రాష్ట్రంలో ఆర్థిక నేరాలు, హత్యలు, దొంగతనాలు పెచ్చుమీరాయి. సర్కారు ఉచితాలంటూ ప్రజలను సోమరులుగా మార్చేసింది. ప్రతి ఇంట్లోనూ చదువుకున్న యువత ఉన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తే వారే కుటుంబాలను పోషించుకోగలరు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం మాటతప్పింది. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి, ఇలాంటి వారికి బుద్ధిచెప్పాలి. భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పార్టీనే గెలిపించాలి.

- కె.సరళ, కైలాసపురం రోడ్డు, విశాఖ

### న్యాయం చేసే ప్రభుత్వం రావాలి



రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసే ప్రభుత్వం కావాలి. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలిచే వ్యక్తిత్వం ఉన్న నేతలకే ఓటు వేయాలి. ప్రజావసరాలను గుర్తించి, పరిష్కరించే సత్తా, సామర్థ్యం కలిగిన నేతలను ఎన్నుకుంటేనే భవిష్యత్తుకు భరోసా.

- ఎ.విజయకుమార్, అనకాపల్లి

### ఉక్కు పరిరక్షణకు హామీ ఇస్తేనే...



స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని హామీ ఇచ్చే పార్టీకి ఓటు వేయాలి. ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం కాకుండా కార్మికులు ఏళ్లుగా ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నారు. ఎన్నికల సమయం వచ్చింది. పరిశ్రమను కాపాడుతామని హామీ ఇచ్చిన వారికే ఓటు వేయాలి.

- ఆర్.తిరుమలరావు, గోపాలపట్నం

### మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుంటున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

**వాట్సాప్ నంబర్ ... 9848212243**

# ఎలమంచిలిలో టీడీపీకి ఆదరణ



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన నియోజకవర్గాలపునర్విభజనలో ఏర్పాటైన వాటిల్లో 'ఎలమంచిలి' ఒకటి. అంతకుముందు కొంతభాగం అటు పాయకరావుపేట నియోజకవర్గంలో ఉండేది. రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు కొండకర్ల నియోజకవర్గంలో ఉండేవి. ఎలమంచిలి సమితిగా ఉన్న సమయంలో 1952లో నియోజకవర్గంగా మారింది. మండల వ్యవస్థ ఏర్పాటైన తరువాత ఎలమంచిలి నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో పాటు ఎస్.రాయవరం, మునగపాక మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో మునగపాక మండలాన్ని పూర్తిగా ఎలమంచిలి నియోజకవర్గంలోకి, ఎస్.రాయవరం మండలాన్ని పాయకరావుపేట నియోజకవర్గంలో విలీనం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం ఒకప్పుడు పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఆ తరువాత అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు ప్రారంభమయ్యాక పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు సాధించింది. అలాగే మేజరు పంచాయతీగా ఉండే ఎలమంచిలి చుట్టుపక్కల ఏడు పంచాయతీల విలీనంతో మునిసిపాలిటీగా మారింది.



పప్పల బాపునాయుడు



వీసం సన్యాసినాయుడు



నగిరెడ్డి సత్యనారాయణ

### టీడీపీకే ఆధిక్యం

నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటివరకూ 15సార్లు ఎన్నికలు జరిగాయి. తొలి ఆరు ఎన్నికల్లో మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు (సి.వి.ఎస్.రాజు, నగిరెడ్డి సత్యనారాయణ, కె.కె.వి.రాజు) గెలిచారు. 1952 ఎన్నికల్లో పప్పల బాపునాయుడు కృషికార్ లోక్ పార్టీ నుంచి గెలుపొందగా, 1955లో సి.వి.ఎస్.రాజు స్వతంత్ర్య అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడు...సీపీఐ అభ్యర్థి వెలగా వీరభద్రరావు (సీపీఐ)పై గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నగిరెడ్డి సత్యనారాయణ...కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వీసం సన్యాసినాయుడుపై విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి కె.కె.వి.రాజు...సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1978లో వీసం సన్యాసినాయుడు(కాంగ్రె స్)...నగిరెడ్డి సత్యనారాయణపై గెలిచారు. 1983లో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన కేకేవీఎస్ రాజు కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై గెలుపొందారు. 1985, 1989లో వీసం సన్యాసినాయుడుపైన, 1994లో నగిరెడ్డి ప్రభాకర్‌రావుపైన, 1999లో ఉప్పలపాటి యువి.రమణమూర్తిరాజు (కన్నబాబు)పైన వరుసగా నాలుగుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన పప్పల చలపతిరావు గెలుపొందారు. 2004, 2009లో రెండు సార్లు ఒకసారి టీడీపీ, మరోసారి ప్రజా రాజ్యం తరపున పోటీకి దిగిన గొంతిన నాగే శ్వరరావుపై కన్నబాబురాజు విజయం సాధించారు. అనంతరం 2014 ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థి ప్రగడ నాగేశ్వరావుపై పంచకర్ల రమేశ్‌బాబు గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుపై యువి. రమణమూర్తిరాజు గెలుపొందారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక చాలా ఏళ్లపాటు విపక్షాలకు నియోజకవర్గంలో చోటులేకుండా పోయింది. వరుసగా ఆ పార్టీ అభ్యర్థులు ఐదుసార్లు విజయకేతనం ఎగురవేశారు. 1983లో జరిగి ఎన్నికల్లో కె.కె.వి.రాజు గెలుపొందగా తర్వాత పప్పల చలపతిరావు వరుసగా నాలుగుసార్లు గెలిచి సంచలనం సృష్టించారు. 1989లో రాష్ట్రం అంతటా కాంగ్రెస్ గాలి వీచినా ఇక్కడి ప్రజలు టీడీపీకే పట్టం కట్టడం విశేషం. టీడీపీ జైత్రయాత్రకు 2004లో బ్రేక్‌పడింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో చలపతిరావును అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించిన టీడీపీ అధిష్ఠానం, ఆయన స్థానంలో గొంతిన నాగేశ్వరరావుకు టికెట్ ఇచ్చింది. ఎంపీగా పప్పల చలపతిరావు విజయం సాధించినా ఎలమంచిలి నియోజకవర్గంలో మాత్రం పార్టీ అభ్యర్థి గొంతిన నాగేశ్వరరావు ఓడిపోయారు. వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లో యు.వి.రమణమూర్తిరాజు వైసీపీ అభ్యర్థిగా, సుందరపు విజయకుమార్ జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అభ్యర్థులు ఎంతమంది ఉన్నా వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ జరగనున్నది.


● ఎలమంచిలి

### నాలుగుసార్లు పప్పల చలపతిరావే విజేత

- ఇప్పటివరకూ 15సార్లు ఎన్నికలు
- ఆరుసార్లు తెలుగుదేశం, నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైసీపీ అభ్యర్థుల గెలుపు



పప్పల చలపతిరావు



యు.వి.రమణమూర్తిరాజు



పంచకర్ల రమేష్ బాబు

ఎలమంచిలి వ్యూ

### ఎలమంచిలి ఎమ్మెల్యేలు వీరే

| సంవత్సరం | విజేత | పార్టీ | మెజార్టీ | ప్రత్యర్థి |
|---|---|---|---|---|
| 1952-1955 | పప్పల బాపునాయుడు | కృషికార్ లోక్‌పార్టీ | .... | ఎ.సూర్యనారాయణమూర్తి (కాంగ్రెస్) |
| 1955-1962 | సి.వి.ఎస్.రాజు | ఇండిపెండెంట్ | 3,660 | కాండ్రేగుల రామజోగి (సీపీఐ) |
| 1962-1967 | వీసం సన్యాసినాయుడు | కాంగ్రెస్ | 3,626 | వెలగా వీరభద్రరావు (సీపీఐ) |
| 1967-1972 | నగిరెడ్డి సత్యనారాయణ | ఇండిపెండెంట్ | 2,355 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1972-1978 | కె.కె.వి.రాజు | ఇండిపెండెంట్ | 6,548 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1978-1983 | వీసం సన్యాసినాయుడు | కాంగ్రెస్ | 8,667 | నగిరెడ్డి సత్యనారాయణ (జెఎన్‌పి) |
| 1983-1985 | కేకేవీఎస్ రాజు | టీడీపీ | 7,828 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1985-1989 | పప్పల చలపతిరావు | టీడీపీ | 9,920 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1989-1994 | పప్పల చలపతిరావు | టీడీపీ | 12,254 | వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్) |
| 1994-1999 | పప్పల చలపతిరావు | టీడీపీ | 24,246 | నగిరెడ్డి ప్రభాకరరావు (కాంగ్రెస్) |
| 1999-2004 | పప్పల చలపతిరావు | టీడీపీ | 7,054 | యూవీరమణమూర్తిరాజు (కాంగ్రెస్) |
| 2004-2009 | యు.వి.రమణమూర్తిరాజు | కాంగ్రెస్ | 5.863 | గొంతిన నాగేశ్వరరావు (టీడీపీ) |
| 2009-2014 | యు.వి.రమణమూర్తిరాజు | కాంగ్రెస్ | 10,090 | గొంతిన నాగేశ్వరరావు (ప్రజారాజ్యం) |
| 2014-2019 | పంచకర్ల రమేశ్‌బాబు | టీడీపీ | 8,375 | ప్రగడ నాగేశ్వరరావు (వైసీపీ) |
| 2019-2024 | యు.వి.రమణమూర్తిరాజు | వైసీపీ | | పంచకర్ల రమేశ్‌బాబు (టీడీపీ |

# చట్టం... చట్రం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకం. ప్రజల ఎన్నుకునే ప్రభుత్వానికి ఓ మార్గం. ఏ ఎన్నికలైనా ప్రజాభిప్రాయాన్ని వంద శాతం ప్రతిబింబించేలా ఉండాలి. ఇందుకు నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ జరగాలి. అలా జరిగేందుకు రాజ్యాంగం ఏర్పాటుచేసిన వ్యవస్థే కేంద్ర ఎన్నికల సంఘం. దీనికి అనుబంధంగా రాష్ట్ర స్థాయి కమిషన్‌లు ఉంటాయి. దేశంలో జరిగే ఏ స్థాయి ఎన్నికలైనా ఎన్నికల సంఘం ప్రత్యక్ష, పరోక్ష అజమాయిషీలోనే జరుగుతాయి. అందువల్ల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మరుక్షణం వ్యవస్థలన్నీ ఎన్నికల సంఘం పరిధిలోకి వెళతాయి. ఈసీ కనుసన్నల్లోనే నడుచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల కోడ్ అమలులో ఉండగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎంత జాగ్రత్తగా ఉంటే వారి భవిష్యత్తుకు అంత మంచిది.

### ఎన్నికల వేళ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందే

- అతిక్రమిస్తే శిక్ష ఎదుర్కొనాల్సి రావచ్చు
- తెలిసి జరిగినా... తెలియక జరిగినా అభ్యర్థులే బాధ్యులు
- మీతోపాటు అనుచరులనూ అప్రమత్తంగా ఉంచాలి
- కోడ్ అమలులో ఉండగా కమిషన్ కనుసన్నల్లోనే అన్నీ






సార్వత్రిక ఎన్నికలు ఐదేళ్లకొకసారి నిర్వహించాలని రాజ్యాంగం నిర్దేశించింది. అనివార్య కారణాలు, ప్రభుత్వాల అనిశ్చితి, పాలకుల నిర్ణయాల వల్ల కొంచెం అటూఇటుగా జరగొచ్చు. ఎప్పుడు నిర్వహించినా ఎన్నికల నిర్వహణ మహాక్రతువు. అధికారం దక్కించుకునేందుకు రాజకీయ పక్షాలు ఎంతగా కష్టపడాలో, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అంతకు రెట్టింపు కష్టపడాలి. ఈ క్రమంలో ఎవరు ఎన్నికల నియమావళిని అతిక్రమించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తారు. ఆ తర్వాత చర్యలు తప్పవు. అందువల్ల ఎన్నికల ప్రచారం సందర్భంలో రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు...ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఇబ్బందుల్లో పడినట్టే. సాధారణ పౌరులు, ఓటర్లు, ఎవరు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా కమిషన్ తక్షణం విచారణకు ఆదేశిస్తుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు లోక్‌సభ, 15 అసెంబ్లీ నియోజకవర్గాలకు వచ్చేనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ఘట్టం కూడా సోమవారం పూర్తయ్యింది. ఇక ఎన్నికలు జరగడమే తరువాయి. అయితే అభ్యర్థులు, పార్టీలకు గెలుపు ఎంతముఖ్యమో ఎన్నికల నియమావళికి లోబడిపనిచేయడం అంతే ముఖ్యం. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉంది. అంటే రాజకీయ పక్షాలు, ప్రతినిధులు చట్టం చట్రంలో ఉన్నట్టే. ఈ నేపథ్యంలో ఎన్నికల చట్టాలు, నియమ నిబంధనలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

### కులమతాలను రెచ్చగొడితే....

ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ పార్టీలు, నాయకులు, అభ్యర్థులు తమ ప్రసంగాల్లో కుల, మతాలను రెచ్చగొట్టేవిధంగా మాట్లాడకూడదు. ఎవరైనా ఆ విధంగా చేసినట్లయితే ఎన్నికల చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయొచ్చు.

### వర్గ విభేదాలు సృష్టిస్తే జైలే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా వర్గ విభేధాలు సృష్టించే ప్రయత్నం చేస్తే సెక్షన్ 125 ప్రకారం మూడేళ్లపాటు జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రెండూ విధించే అధికారం కోర్టుకు ఉంటుంది.

### 48 గంటల ముందే ప్రచారానికి తెర...

ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలి. ఒక వేళ ఏ పార్టీకి సంబంధించిన నాయకులు, అభ్యర్థులైనా ఆ తర్వాత సభలు, సమావేశాలు నిర్వహించినట్టు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందితే సెక్షన్ 126 ప్రకారం శిక్ష తప్పదు. ఫిర్యాదు దారుడు అందించిన సాక్ష్యాధారాల ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

### అల్లర్లు సృష్టిస్తే ఆరు నెలల జైలు

ఎన్నికల సభలు, సమావేశాలు, ప్రచారం సందర్భంలో అల్లర్లు సృష్టించినట్టు రుజువైతే పోలీసులు బాధ్యులైన మూకలను చట్టంలోని 127 సెక్షన్ ప్రకారం అరెస్టు చేయవచ్చు. రుజువైతే కనీసం ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేల వరకు జరిమానా తప్పదు.

### పోలింగ్ సిబ్బందికి చిక్కులే

చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసులు ఏ పార్టీకి చెందిన అభ్యర్థికైనా బహిరంగంగా, లోపాయికారీగా సహకరిస్తే చిక్కుల్లో పడతారు. అలా చేసినట్టు ఉద్యోగులపై ఫిర్యాదులు అందితే, కమిషన్ విచారణ జరుపుతుంది. నేరం రుజువైతే ఉద్యోగులకు కనీసం మూడు నెలల జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా, ఓట్ల లెక్కింపు ఏజెంట్లుగా పార్టీల తరుపున వెళితే అటువంటి వారిపై ఫిర్యాదులు అందితే కమిషన్ సెక్షన్ 134ఎ ప్రకారం చర్యలు చేపట్టనున్నది. నేరం రుజువైతే కనీసం మూడు నెలలు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు.

### ఈవీఎంలు అపహరిస్తే ఏడాది జైలు

పోలింగ్ కేంద్రాల నుంచి అల్లరి మూకలు ఈవీఎంలు అపహరిస్తే అటువంటి వారిపై పోలీసులు చట్టంలోని 135వ సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేస్తారు. దుండగులకు ఏడాది జైలు శిక్ష, రూ500 జరిమానా విధించే అవకాశం ఉంది.

### మారణాయుధాలతో తిరిగితే...

ఎన్నికల సందర్భంగా ఎవరైనా మారణాయుధాలతో తిరగడం నేరం. సంబంధిత పోలీసులు మారణాయుధాలతో పట్టుబడిన వ్యక్తులకు రెండు నెలల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది.

### మీ ఓటు మరొకరు వేస్తే...

పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికే మీ ఓటు ఎవరైనా వేసేస్తే పోలింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. మీ ఓటుకు సంబంధించి సరైన ఆధారాలు చూపిస్తే, ఓటు దుర్వినియోగం అయినట్టు తేలితే పోలింగ్ అధికారి మీకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. దీన్నే ఛాలెంజింగ్ ఓటు అంటారు. దీన్ని బ్యాలెట్ బాక్స్‌లో కాకుండా ప్రత్యేకంగా భద్రపరుస్తారు.

### బహిరంగంగా ఓటేసినా ఇబ్బందే

ఎన్నికల నిబంధనావళి ప్రకారం ఓటు వేసే ప్రక్రియ రహస్యంగా సాగాలి. ఓటర్లు ఎవరైనా బహిరంగంగా ఓటు వేస్తే ఆ ఓటరుకు చట్టం ప్రకారం మూడు నెలల జైలు, జరిమానా విధిస్తారు. ఓటేసే వారు నియమ నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు తప్పవు.

### పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం నిషేధం

పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లలోపు ఎన్నికల ప్రచారాన్ని కమిషన్ నిషేధించింది. ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమించి పోలింగ్ కేంద్రం పరిధిలో ప్రచారం చేస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు బాధ్యత వహించాల్సి వస్తుంది. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రచార సామగ్రిని స్వాధీనం చేసుకునే అధికారం కమిషన్ కల్పించింది.

● విశాఖపట్నం

# భలే రికార్డు

## పెందుర్తి ఎమ్మెల్యేలైన తండ్రీ తనయులు

- 1978లో గుడివాడ అప్పన్న, 1989లో గుడివాడ గురునాథరావు విజయం
- 1983లో పెతకంశెట్టి అప్పలనరసింహం, 1996లో గణబాబు గెలుపు
- పెతకంశెట్టి, గణబాబుపై పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణ, శ్రీనివాస్ తండ్రీ తనయులే!



గుడివాడ అప్పన్న



గుడివాడ గురునాథరావు

ఉమ్మడి రాష్ట్రంలో రెండో అతిపెద్ద నియోజకవర్గంగా నిలిచిన పెందుర్తి మరో ఘనతను కూడా సాధించింది. ఇక్కడి నుంచి పోటీలో నిలిచిన తండ్రీ తనయులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకుంది. ఇలా ఒకసారి కాదు... రెండు సార్లు తండ్రీ కుమారులు పదవులను అలంకరించారు. ఆ వివరాలివి... 1978లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పెందుర్తి నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన గుడివాడ అప్పన్న సీపీఎం అభ్యర్థి గంగాధరరెడ్డిపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత గుడివాడ అప్పన్న కుమారుడు గుడివాడ గురునాథరావు 1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీచేసి టీడీపీ అభ్యర్థి పల్లా సింహాచలంపై గెలుపొందారు. ఇలా 1978, 1989లో తండ్రీ కుమారులు ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ఘనతను సాధించారు.



పెతకంశెట్టి అప్పలనరసింహం



పెతకంశెట్టి గణబాబు

అలాగే పెతకంశెట్టి అప్పల నరసింహం, ఆయన కుమారుడు గణబాబు ఇదే నియోజకవర్గం నుంచి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పెతకంశెట్టి అప్పలనరసింహం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన ద్రోణంరాజు సత్యనారాయణపై విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. అదేవిధంగా పెతకంశెట్టి కమారుడు పీవీజీఆర్ నాయుడు (గణబాబు) 1996లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై గెలుపొందారు. ఇలా 1983, 96లో తండ్రీ కుమారులు ఎమ్మెల్యేలు అయ్యారు. ఇందులో మరో గమ్మత్తైన విషయం ఏమిటంటే ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తండ్రీ తనయులు పెతకంశెట్టి అప్పలనరసింహం, గణబాబు పోటీచేసిన సందర్భంలో వారి ప్రత్యర్థులు ద్రోణంరాజు సత్యనారాయణ, ద్రోణంరాజు శ్రీనివాస్ కూడా తండ్రీ తనయులే కావడం.

### అక్కడ తండ్రులు... ఇక్కడ కుమారులు

ఇక ఈ సార్వత్రిక ఎన్నికల్లో మరో విశేషం చోటుచేసుకుంది. పెందుర్తిలో పరస్పరం పోటీ పడిన వారి కుమారులు ప్రస్తుతం గాజువాకలో ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి వైసీపీ, టీడీపీ అభ్యర్థులుగా తలపడుతున్న గుడివాడ అమర్‌నాథ్, పల్లా శ్రీనివాసరావు తండ్రులు గతంలో పెందుర్తి నియోజవర్గం నుంచి పోటీచేశారు. ఇప్పటి గాజువాక అప్పట్లో పెందుర్తి పరిధిలో ఉండేది. ఈక్రమంలో 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెందుర్తి నుంచి గుడివాడ గురునాథరావు, పల్లా సింహాచలం పోటీ చేశారు. గుడివాడ విజయం సాధించారు. యాదృచ్ఛికంగా ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ గురునాథరావు కుమారుడు. ఇక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం. ఇలా గతంలో పెందుర్తిలో తలపడిన తండ్రుల స్థానంలో వారి తనయులే గాజువాక నుంచి పోటీ పడుతుండడం ప్రత్యేకత సంతరించుకుంది.

● పెందుర్తి

## మీకు తెలుసా!

### వీవీపీఏటీ (వీవీప్యాట్) అంటే ...




ఎన్నికల సంస్కరణల్లో భాగంగా భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన పరికరాలలో వీవీపీఏటీ (వీవీప్యాట్) ఒకటి. దీనిని ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ అంటారు. ఇది ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌కు అనుసంధాన మయ్యే పేపర్ రికార్డు. ప్రింటర్ పోర్ట్ ద్వారా ఈవీఎంతో కనెక్ట్ చేస్తారు. ఓటు రికార్డింగ్‌ను ధ్రువీకరించడానికి పేపర్ స్లిప్‌లో ఓటు డేటా, కౌంటర్లను రికార్డు చేస్తుంది. ఎన్నికల్లో మోసాలు, రిగ్గింగ్‌ను తొలగించడంలో సహాయపడుతుందని ఈసీ ప్రకటించింది.

### డిపాజిట్ కోల్పోవడం అంటే..

ఎన్నికల సమయంలో కొంతమంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారని వింటుంటాం. అంటే.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థికి పోలైన, చెల్లిన ఓట్లలో 1/6వ వంతు రావాల్సి ఉంటుంది. లేదంటే పోటీ చేసేందుకు చెల్లించిన డిపాజిట్ సొమ్మును కోల్పోయినట్టు.

## 14 మంది వలంటీర్ల రాజీనామా

**పరవాడ, ఏప్రిల్ 29 :** మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. వాడచీపురుపల్లి సచివాలయం పరిధిలో సోమవారం 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శి మురళీధర్‌పట్నాయక్‌కు అందజేశారు. ఇదే సచివాలయం పరిధిలో నాలుగు రోజుల క్రితం 18 మంది వలంటీర్లు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మొత్తం ఈ సచివాలయం పరిధిలో 34 మంది వలంటీర్లుకు గాను 32 మంది రాజీనామా చేశారు.

## 11,167 మందికి పెన్షన్‌లు

**అచ్యుతాపురం, ఏప్రిల్ 29:** మే ఒకటి నుంచి ప్రత్యక్ష నగదు బదిలీపై పెన్షన్‌లు పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలో 11,167 పెన్షన్‌లున్నాయని, వీటిలో 8,240 మందికి ఆధార్ అనుసంధానం చేసి బ్యాంకు ఖాతాలకు మే ఒకటిన జమ చేస్తామన్నారు. మిగిలిన వారికి ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా ఇస్తామన్నారు. మే మూడులోగా అందని పక్షంలో విచారణ జరిపి నేరుగా పంపిణీ చేస్తామన్నారు.

## పురుగులు మందులు లేని సాగుపై అవగాహన

**అచ్యుతాపురం, ఏప్రిల్ 29:** సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలని గుంటూరు ఏపీ బయోవర్సిటీ బోర్డు ఐసీఆర్పీ కరణం వెంకటరమణ అన్నారు. సోమవారం హరిపాలెంలో విద్యార్థులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని అంతా భద్రపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగులు మందులు లేని సేంద్రియ ఎరువుల తయారీని వివరించారు. ఈ కార్యక్రమంలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి సిబ్బంది,, అనకాపల్లి ఏఎంఏఎల్ బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి నేతల ప్రచారం

**అచ్యుతాపురం, ఏప్రిల్ 29:** జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించాలని కోరుతూ మండలంలో పలు పంచాయతీల్లో సోమవారం టీడీపీ, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పూడిమడకలో టీడీపీ నాయకుడు మేరుగు బాపునాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గాజుగ్లాసు, కమలం గుర్తులకే ఓటు వేయాలని కోరారు. తంతడిలో టీడీపీ నాయకుడు వంక కృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కొండకర్లలో బీజేపీ ఎలమంచిలి ఇన్‌చార్జి రాజాన సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలను కలిసి ఉమ్మడి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో అగ్గాల హనుమంతరావు, జి.నరసింహనాయుడు, గొంతిన భక్తసాయిరాం. చుక్క అనురాధ, పొన్నమళ్ల కొండబాబు పాల్గొన్నారు.

**కోటవురట్లలో..** మండలం గొట్టివాడ, రామచంద్రపురం గ్రామాల్లో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ బంధువు చరణ్, టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారానిక్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే అనితకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకర్‌బాబ్జీ, తిరుమలరావు పాల్గొన్నారు.

**పరవాడలో..** జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించాలని కోరుతూ సోమవారం రాత్రి రావాడ పంచాయతీలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. పంచకర్లకు గాజుగ్లాసు, సీఎం రమేశ్‌కు కమలం గుర్తులపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మరిన అప్పలరాజు, సాలాపు రమణ, తోట బాబూరావు, మోటూరు హరిబాబు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13,198 మందికి పింఛన్లు

**పాయకరావుపేట, ఏప్రిల్ 29:** మండలంలో మే నెలకు సంబంధించి 13,198 మందికి సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ కె.స్వప్న తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల్లో 9,951 మంది పింఛనుదారులకు పింఛను సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నామన్నారు. మిగిలిన 3,247 మందికి సిబ్బంది ఇంటికి వెళ్లి ఇవ్వనున్నారన్నారు. పింఛనుదారులు ఆందోళన చెందనవసరం లేదని, పింఛను తీసుకోవడానికి సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదని, డబ్బులు అవసరమైనపుడు బ్యాంక్‌కు వెళ్లి డ్రా చేసుకోవచ్చని తెలిపారు.

## పాములవాక గొంతెండుతోంది..

**కోటవురట్ల, ఏప్రిల్ 29:** మండలంలోని పాములవాక గ్రామంలో నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి మండుటెండలో నీరు తెచ్చుకొని గొంతు తడుపుకుంటున్నారు. కొత్తపైపులైన్లు సక్రమం వేయకపోవడం, పాతపైపులైన్లు లీకేజీలు కారణంగా పాములవాక ఎస్సీ కాలనీ వాసులు పది రోజుల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని గ్రామ మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు..

## మోసా అప్పలరాజు బీజేపీకి రాజీనామా

**పాయకరావుపేట, ఏప్రిల్ 29 :** బీజేపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఫిషర్‌మెన్ సెల్ ఇన్‌చార్జి మోసా అప్పలరాజు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాను పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలికి మెయిల్ ద్వారా పంపుతున్నానన్నారు. తాను ఏ పార్టీలో చేరేది మత్స్యకార నాయకులతో చర్చించి, ప్రకటన చేస్తానన్నారు.

## పలువురు జనసేనలో చేరిక

**పరవాడ, ఏప్రిల్ 29:** ముత్యాలమ్మపాలెం పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు సోమవారం జనసేనలో చేరారు. సబ్బవరం మండలం మొగలిపురంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి సమక్షంలో వీరంతా వైసీపీ నుంచి జనసేనలోకి చేరారు. జనసేనలో బొంది కోటేశ్వరరావు, బొంది మహేష్, బొంది పెంటయ్య, షైలపల్లి బంగారాజు, షైలపల్లి పోలరాజుతోపాటు 40 కుటుంబాలు చేరాయి.

## బరిలో నిలిచేది వీరే..

... 5వ పేజీ తరువాయి

రమేశ్‌బాబు(జనసేన), అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ), కాంగ్రెస్ అభ్యర్థిగా పిరిడి భగత్ బరిలో ఉన్నారు.

**అన్నిచోట్ల కూటమి, వైసీపీ మధ్యే పోరు**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగుచోట్ల టీడీపీ అభ్యర్థులు, మూడు చోట్ల జనసేన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి కూటమి తరపున టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య హోరాహోరీ పోరు ఉంది. పాయకరావుపేట (ఎస్సీ) నియోజకవర్గంలో కూటమి తరపున టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఆమెపై వైసీపీ తరపున విజయనగరం జిల్లా రాజాం వైసీపీ ఎమ్మెల్యే కంబాల జోగులు పోటీలో ఉన్నారు. చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్ఎన్ఎస్ రాజు పోటీలో ఉంటే, ఆయనపై సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పోటీలో నిలిచారు. మాడుగుల నుంచి టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ పోటీ చేస్తున్నారు. అనకాపల్లి అసెంబ్లీ నుంచి కూటమి తరపున జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పోటీ చేస్తుండగా, అయనపై వైసీపీ అభ్యర్థిగా మలసాల భరత్ తలపడనున్నారు. ఎలమంచిలి నుంచి కూటమి తరపున జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ పోటీలో నిలిచారు. ఆయనపై వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబు రాజు తలపడుతున్నారు. పెందుర్తి నుంచి కూటమి తరపున జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేశ్, ఆయనపై వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు పోటీ పడుతున్నారు.

# నాలుగు సెగ్మెంట్లలో 45 మంది పోటీ

**అనకాపల్లిలో 12 మంది.. పాయకరావుపేటలో 9 మంది... ఎలమంచిలిలో 10 మంది.. పెందుర్తిలో 14 మంది పోటీ**

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29 :** సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. సోమవారం పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, పెందుర్తి నియోజకవర్గాల్లో 45 మంది పోటీలో ఉన్నారు.

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ స్థానానికి 15 మంది నామినేషన్లు వేశారు. వీరిలో ముగ్గురి నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవి తిరస్కరించారు. మిగిలిన 12 మందిలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ సమయానికి ఎవరూ పోటీ నుంచి తప్పుకోకపోవడంతో 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్టు ఆర్‌వో కార్యాలయ డీటీ జయశ్రీ తెలిపారు. పోటీలో ఉన్నవారిలో ఐఆర్ గంగాధర్ (కాంగ్రెస్), మలసాల భరత్‌కుమార్ (వైసీపీ), సూదికొండ మాణిక్యాలరావు (బహుజన సమాజ్), పొలమరశెట్టి అంబికాదేవి (పిరమిడ్ పార్టీ), ఒమ్మి వెంకటయాదవ్ (సమాజ్‌వాది పార్టీ), కనిశెట్టి సురేష్‌బాబు (జై భారత్), కొణతాల రామకృష్ణ (జనసేన), తోట వెంకటసాయి ముకుంద (ప్రజా ప్రస్థానం), దొమ్మేని అప్పారావు (రిపబ్లికన్ పార్టీ), ఎస్‌వీవీ రామచంద్రరావు (ప్రేమ్ జనతా దళ్), అళ్ల సత్తిరాజు (స్వతంత్ర), కాసారపు సత్యనారాయణ (స్వతంత్ర)లు ఎన్నికల బరిలో ఉన్నారు.

**పాయకరావుపేటలో..**

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 9 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తం 18 మంది నామినేషన్లు వేయగా, ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. మిగిలిన 17 మందిలో 8 మంది సోమవారం నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 9 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో అనిత వంగలపూడి(టీడీపీ), కాకర నరసింహారావు (బహుజన సమాజ పార్టీ), జోగులు కంబాల(వైసీపీ), బోని తాతారావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), కృష్ణ స్వరూప్ వడ్లమూరి (దళిత బహుజన పార్టీ), దూలపల్లి నాగేశ్వరరావు(జై భారత్ నేషనల్ పార్టీ), పరవాడ రామకృష్ణ (ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ), భూర్తి ఏసయ్య(స్వతంత్ర అభ్యర్థి), శెట్టి బత్తుల ధర్మరాజు (స్వతంత్ర అభ్యర్థి) బరిలో నిలిచారు.

**ఎలమంచిలిలో..**

ఎలమంచిలి: ఎలమంచిలి నియోజకవర్గ అసెంబ్లీ బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. సోమవారం 3 గంటలతో నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్టు రిటర్నింగ్ అధికారి మనోరమ తెలిపారు. ఎలమంచిలి అసెంబ్లీ బరిలో 18 మంది నామినేషను దాఖలు చేయగా.. 4 నామినేషన్లు తిరస్కరించిన విషయం తెలిసిందే. మరో నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో పోటీల్లో 10 మంది అభ్యర్థులు నిలిచారు. పోటీలో తనకాల అనంత రామనరసింగరావు(కాంగ్రెస్), ఉప్పలపాటి వెంకట రమణమూర్తిరాజు(వైసీపీ), లంబా శ్రీనివాసరావు(బహుజన సమాజ్ పార్టీ), బి. అమ్మాజమ్మ(పిరమిడ్ పార్టీ), అర్జున్ కుమార్ సుందరపు(నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), దాడి పూర్ణ చంద్రరావు(జై భారత్ పార్టీ), బోజా నాగేశ్వరరావు(రిపార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా), సుందరపు విజయ్ కుమార్(జనసేన), ప్రగడ అన్నపూర్ణ (స్వతంత్ర అభ్యర్థి), మొల్లేటి రమేష్(స్వతంత్ర) ఉన్నారు.

**పెందుర్తిలో..**

పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదుగురు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 14 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇక్కడ 20 మంది అభ్యర్థులు 33 నామినేషన్లు వేయగా ఉపసంహరణ తర్వాత 14 మంది పోటీలో ఉన్నారు. నామినేషన్లను ఉపసంహరించుకున్న వారిలో జనసేన పార్టీకి చెందిన పంచకర్ల మహాలక్ష్మి, పంచకర్ల వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులు షేక్ షఫీ ఉల్లా, గుంటూరు సాయిప్రియ, బంటికోరు గోవిందరాజు ఉన్నారు.కాగా పోటీలో అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ), పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన), బంగారి రమణ (బీఎస్పీ), పిరిడి భగత్ (కాంగ్రెస్), ఈత రోజా (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), ఏలూరు వెంకటరమణ (నేషనలిస్ట్ జనశక్తి), కన్నేపల్లి మహదేవ్ (జైభారత్ నేషనల్ పార్టీ), పి.రమేశ్ నాయుడు (నవరంగ్ కాంగ్రెస్), బోలెం వెంకట మురళీ మోహన్ (సమాజ్‌వాద్), ఆడారి నాగరాజు (స్వతంత్ర), కూండ్రపు సన్యాసిరావు (స్వతంత్ర), గుంటూరు వెంకట నరసింహరావు (స్వతంత్ర), పొన్నాడ అప్పలనాయుడు (స్వతంత్ర), వడ్డాది ఉదయ్‌కుమార్ (స్వతంత్ర) ఉన్నారు.

# రానున్నది కూటమి ప్రభుత్వమే : సుందరపు



రాజుకోడూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సుందరపు విజయకుమార్

**రాంబిల్లి, ఏప్రిల్ 29:** రానున్నది కూటమి ప్రభుత్వమేనని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం ఆయన ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరుడు సీఎం రాజేష్, కూటమి నేతలతో కలిసి హరిపురం, రాజుకోడూరు, కృష్ణంపాలెం, వెల్చూరు, ఇంటింట ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే ఉపాధి కూలీలతో అయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రజలను అన్నివిధాల మోసం చేయడంతోపాటు, ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేశారని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మడుతూరులో వార్డు మెంబరు జనసేనలో చేరిక**

**అచ్యుతాపురం:** జగన్ రెడ్డి పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం మడుతూరు ఎనిమిదవ వార్డు మెంబరు నడుపూరు హారతి ప్రవీణ్ తన అనుయాయులతో జనసేనలో చేరారు. వీరికి కండువాలు వేసి విజయకుమార్ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సన్యాసినాయుడు, లట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ఎన్‌డీఏ ప్రభంజనం

**» టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత**



పెట్టుగోళ్లపల్లిలో అనితకు హారతి పడుతున్న మహిళలు

**నక్కపల్లి, ఏప్రిల్ 29:** ఈ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి ప్రభంజనం ఖాయమని, వైసీపీ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, యువకులు టీడీపీలో చేరుతుండడమే ఇందుకు నిదర్శనమని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు, టీడీపీ పాయకరావుపేట అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. శనివారం మండలంలోని గొడిచెర్ల, చినతీనార్లలకు చెందిన పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. నక్కపల్లిలో తన నివాసం వద్ద వారందరికీ అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

**పాయకరావుపేటరూరల్‌లో..** వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టివేసిం దని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని గోపాలపట్నం, పెద్దిపాలెం గ్రామాలలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గోపాలపట్నం గ్రామ మాజీ సర్పంచ్ దంతులూరి సుధాకర్‌రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గణపర్తి రాజుబాబుల ఆధ్వర్యంలో దంతులూరి బాబారాజు, వెలుగుల అయ్యన్నదొర అనుచరులతో కలసి 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ అనిత కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, మాజీ ఎంపీపీ యేజర్ల వినోద్‌రాజు, ఎంపీటీసీ సభ్యుడు కలిదిండి సతీష్‌రాజు, నాయకులు గూటూరు శ్రీనివాసరావు, దంతులూరి సుధాకర్‌రాజు, బాబారాజు, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరంలో..** కొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయని టీడీపీ పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని పెట్టుగోళ్లపల్లిలో సోమవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి ఆధ్వర్యంలో అనిత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం అడ్డరోడ్డు, కొరుప్రోలు గ్రామాల్లో అనిత ప్రచారం చేశారు. మండలంలోని గుర్రాజుపేటలో వైసీపీకి చెందిన 25 కుటుంబాలు సోమవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి వచ్చిన వారందరికీ అనిత పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, నాయకులు ఎస్.వెంకటరాజు, వజ్రపు శంకరరావు పాల్గొన్నారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

**» పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు**





రోడ్ షోలో సీఎం రమేశ్, పంచకర్ల రమేశ్‌బాబు, గండి బాబ్జీ తదితరులు

**వేపగుంట, ఏప్రిల్ 29:** రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించవలసిందిగా జనసేన పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. 93వ వార్డు పరిధిలోని టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అరాచక పాలనతో రాష్ట్రం ఇరవై ఏళ్లు వెనక్కి పోయిందని, ఏపీ గాడిలో పడాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమన్నారు. అనంతరం పంచకర్ల 94వ వార్డు ఆర్ఆర్‌వీపురం,వెంకటసాయినగర్‌లో ప్రచారం సాగించారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, నాయకులు పి.పార్వతి, నాగరాజు పాల్గొన్నారు.

**అభివృద్ధి చేసి చూపిస్తా: సీఎం రమేశ్**

తనను గెలిపిస్తే జాతీయ స్థాయిలో ఉన్న పరిచయాలతో అనకాపల్లి, పెందుర్తి విలీన ప్రాంతా లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అనకాపల్లి అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. 94వ వార్డు పరిధిలోని కృష్ణరాయపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో పంచకర్లతో కలిసి రోడ్ షో నిర్వహించగా వారికి కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన సేనాతివానిపాలెంలోని షిర్డీ సాయి ఆలయాన్ని సందర్శించారు. నాయకులు గండి బాబ్జీ, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాస నాయుడు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**పంచకర్ల సతీమణి ప్రచారం**

**పెందుర్తి:** జనసేన పార్టీ 'పెందుర్తి' అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సతీమణి మండలంలోని రాంపురం, పినగాడిలో ప్రచారం చేశారు. ఇరు గామాల్లోని ఉపాధి హామీ పథక పనులు చేస్తున్న మహిళా కూలీలతో సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఉపాధి కూలీల వేతనం పెంపునకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపీపీ వరలక్ష్మి, కన్నబాబు, హరగోపాల్ పాల్గొన్నారు.

# పేలవంగా జగన్ సభ

... 5వ పేజీ తరువాయి

గోవాడకు, ఈ ప్రాంత రైతాంగానికి భరోసా ఇచ్చే విధంగా సీఎం నుంచి గట్టి హామీ లభిస్తుందని ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైందని చెప్పాలి. ఇక ప్రధానంగా సాగునీటి వనరుల అభివృద్ధి గురించి కనీస ప్రస్తావన తీసుకు రాకపోవడం, ఈ ప్రాంత రైతాంగం ఎదురుచూస్తున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి గానీ పెద్దేరు, కల్యాణపులోవ, కోనాం,, రైవాడ రిజర్వాయర్ల అభివృద్ధి గురించి ఏమాత్రం సీఎం మాట్లాడకపోవడం స్థానికులను నిరాశకు గురిచేసింది. సీఎం జగన్ కేవలం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి, ప్రతిపక్షం అధికారంలోకి వస్తే ఇవేమీ అందవని ప్రజలను భయపెట్టడమే అజెండాగా ప్రసంగం సాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సీఎం ప్రసంగానికి స్పందన కరువు**

సుమారు 45 నిమిషాల పాటు సాగిన సీఎం ప్రసంగంలో గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలైన చోడవరం, మాడుగుల ప్రజలకు ఊరట ఇచ్చే విధంగా ఎలాంటి హామీలు లేకపోగా, చివరి నిమిషంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీలను పరిచయం చేస్తూ వారికి ఓటేసి గెలిపించాలని కోరి సభను ముగించడంతో సభకు హాజరైన జనం నుంచి స్పందన కరువైంది. చోడవరం, మాడుగులకు ఏం చేశామో?, ఏం చేస్తామో కూడా ప్రస్తావన లేదు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయలేదని, తాము సంపూర్ణంగా హామీలు అమలు చేశామంటూ గట్టిగా మాట్లాడినప్పటికీ ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. రాయలసీమ యాసలో సీఎం జగన్ మాట్లాడిన మాటలు చాలా వరకు స్థానికులకు అర్థం కాకపోవడంతో జనం స్పందించలేదు. జగన్ సభతో జనంలో ఊపు వస్తుందని ఆశించిన అధికార పార్టీ నేతలకు ఆశాభంగం కలిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.

**వాహనాల్లో జనం తరలింపు**

సీఎం జగన్ సభకు వైసీపీ నాయకులు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆటోలు, వ్యాన్లు, బస్సుల్లో జనాన్ని తరలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆటోలు స్థానిక గాంధీగ్రామం, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోనూ, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోనూ నిలిపి ఉంచారు. అయితే ఎండ ఎక్కువగా ఉండడంతో చాలా మంది వాహనాల్లోనే ఉండిపోయారు.

**దుకాణాలను మూయించిన పోలీసులు**

పట్టణంలో నిర్వహించిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ స్థానిక వ్యాపారులతో పాటు, వాహనదారులకు సంకటంగా మారింది. జగన్ సభ నిర్వహించిన కొత్తూరు జంక్షన్‌తో పాటు ప్రధాన రహదారి, కొత్తూరు జంక్షన్ నుంచి ఇటు దేవరాపల్లి, అటు పీఎస్‌పేట రోడ్డులో చాలా వరకు దుకాణాలను పోలీసులు మూసివేయించారు. అసలే వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉన్న ఈ సమయంలో ఎన్నికల ప్రచార సభ కోసం తమ దుకాణాలను మూసివేయించి తమ కడుపు కొట్టడమేమిటంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక సభ జరిగిన కొత్తూరు జంక్షన్‌లో ప్రధాన రహదారిని పూర్తిగా బారికేడ్లతో మూసివేయించి ఎవరినీ అనుమతించకపోవడం, ప్రధాన రహదారిపై ఉదయం 8 గంటల నుంచే వాహనాలను అనుమతించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక చోడవరంలో సీఎం సభ ప్రారంభానికి రెండు గంటల ముందు నుంచే పాడేరు- చోడవరం రూట్లో వడ్డాది వద్ద, చోడవరం- విశాఖ- అనకాపల్లి రూట్లో వెంకన్నపాలెం జంక్షన్ వద్ద బస్సులు, ఇతర వాహనాలను నిలిపివేయడంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం జగన్ సభకు వచ్చే కార్యకర్తల వాహనాలు మినహా మిగిలిన వాహనాలను నిలిపివేయడంతో ఇతర ప్రాంతాల ప్రజలతో పాటు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

## సంతలో కూరగాయలు విక్రయిస్తూ..

**» సీఎం రమేశ్ భార్య శ్రీదేవి ప్రచారం**



సంతలో కూరగాయలు అమ్ముతున్న సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి

**ఎస్.రాయవరం, ఏప్రిల్ 29:** మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంతలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతలో ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి వ్యాపారస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూరగాయలను విక్రయించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీగా పోటీ చేస్తున్న తన భర్త రమేశ్‌కు కమలం గుర్తుపైన, టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని శ్రీదేవి కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రవిరాజు, మండల అధ్యక్షుడు బి. జోగునాయుడు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## 'ప్రజలను మోసగించిన వైసీపీని చిత్తుగా ఓడించాలి'

**అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29 :** తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసగించిన వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్ గంగాధర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన అనకాపల్లి, పరిసర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నమ్మించి గద్దెనెక్కిన సీఎం జగన్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కేంద్రంలోని బీజేపీకి తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలని కోరారు. అయన వెంట నాయకులు ఎగ్గాడ భాస్కరరావు, దాసరి సంతోష్, కొల్లి సత్యారావు, గజ్జాలు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్ రెక్కలు విరిగిపోవడం ఖాయం

**» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రంగనాయకులు**



గోవిందపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న రంగనాయకులు

**రాంబిల్లి, ఏప్రిల్ 29 :** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమిదే అధికారమని, ఫ్యాన్ రెక్కలు విరిగిపోవడం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు అన్నారు. సోమవారం ఆయన గోవిందపాలెంలో కూటమి నేతలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన కన్నబాబు రాజు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజుగ్లాసు గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కలిదిండి రఘురాజు, ధర్మాల గోవిందరెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.

## 'పేట'లో జోరుగా ఎన్డీఏ కూటమి ప్రచారం

**పాయకరావుపేట, ఏప్రిల్ 29 :** సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పట్టణంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారాన్ని సోమవారం స్థానిక రాజుగారిబీడు తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. కూటమి నాయకులు ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్‌ని పంపిణీ చేశారు. బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు చింతకాయల రాంబాబు, బత్తిన అచ్చిరాజు, జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవిందు, పెదిరెడ్డి నాగవెంకటరమణ, గుల్లా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై వాగ్వాదం

**ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈను నిలదీసిన రావాడ సర్పంచ్**

**పరవాడ, ఏప్రిల్ 29:** తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారికి, ప్రజాప్రతినిధికి మధ్య మండల సమావేశంలో వాగ్వాదం చోటుచేసుకుంది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి. షణ్ముఖ మాట్లాడుతూ పరవాడ, ముత్యాలమ్మపాలెం, జాలారిపేట గ్రామాల్లో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సందర్భంగా రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు మాట్లాడుతూ మోటూరివానిపాలెంలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు అధ్వానంగా ఉన్నాయని, అదనంగా రెండేసి కొళాయిలు బిగించడంతో తాగునీటి సరఫరా లేకుండా పోయిందన్నారు. దీంతో ఏఈఈ జోక్యం చేసుకొని అదనంగా వేసిన కొళాయిలకు డమ్మీలు వేయించామన్నారు. దీనిపై సర్పంచ్ సంతృప్తి చెందలేదు. నీరు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఏఈఈ మాట్లాడుతూ లిఖితపూర్వకంగా తమకు ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరిస్తామని సమాధానమివ్వడంతో సర్పంచ్ ఒక్కసారిగా కోపోద్రుక్తుడు అయ్యారు. మండల సమావేశంలో సమస్యను దృష్టికి తీసుకువెళితే పరిష్కార మార్గం చూడాల్సిన బాధ్యత లేదా అంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంటనే జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, పరవాడ ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు కలుగజేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఏఈఈని కోరారు. దీంతో వాగ్వాదం సద్దుమణిగింది. ఎంఈవో దివాకర్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 89.47 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోను అభినందించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ లలిత మాట్లాడుతూ మండలంలో రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో ఎంపీడీవో కీర్తి స్పందన, ఏవో రాంబాబు, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బందం నాగేశ్వరరావు, భూసా అప్పలరాజు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూకరాజు

**ఎలమంచిలి, ఏప్రిల్ 29:** ఎలమంచిలి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా దూళి నూకరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా పెరుమాళ్ల వెంకట రమణ ఎన్నికయ్యారు. సోమవారం బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జాయింట్ సెక్రటరీగా కేసీహెచ్.దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజేతలను న్యాయవాదులు అభినందించారు.

## మైహోమ్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**ఎలమంచిలి, ఏప్రిల్ 29:** మండలంలోని ములకలాపల్లి మై హోమ్ సిమెంటు పరిశ్రమ ఆవరణలో సోమవారం రాత్రి వ్యూహలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 4 రోజులుపాటు జరుగుతాయని పరిశ్రమ సీనియర్ వైస్ చైర్మన్(వర్క్స్) వీహెచ్. చౌదరి తెలిపారు. మైహోమ్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు చేతులు మీదుగా ఉత్సవాలు జరుగుతాయన్నారు.

# అగ్నిమాపక కేంద్రంలో సిబ్బంది కొరత

- ప్రమాదాలు జరిగినప్పుడు ఉన్నవారిపై పనిభారం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మాడుగులలో అగ్నిమాపక కేంద్ర కార్యాలయం

**మాడుగుల రూరల్, ఏప్రిల్ 29 :** ఇక్కడి అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. సాధారణంగా ఫైర్ ఆఫీసర్, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మన్‌లు, ముగ్గురు డ్రైవర్లు, తొమ్మిది మంది ఫైర్‌మన్‌లు ఉండాలి. కానీ ఇక్కడ ప్రస్తుతం ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మన్‌లు, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు ఫైర్‌మన్‌లతో పాటు నలుగురు హోంగార్డులు డిప్యూటేషన్‌పై వచ్చి విధులను నిర్వహిస్తున్నారు. ఎల్‌ఎఫ్‌వో, డ్రైవర్ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఏడుగురు ఫైర్‌మన్‌లను ఇక్కడ నియమించ లేదు. మాడుగుల మండలంతో పాటు చీడికాడ మండలంలోని కొన్ని గ్రామాలు మాడుగుల ఫైర్ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఏ గ్రామంలోనైనా అగ్నిప్రమాదం జరిగినా, ఎటువంటి ప్రమాద రక్షణ చర్యలకైనా ఫైర్ సిబ్బంది హాజరవుతుంటారు. అలాగే, ఏటి ప్రవాహాలు, బావులు, నీళ్లలో పడి ఎవరైనా మృత్యువాతపడినా, ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవించినా హుటాహుటిన సదరు సిబ్బంది వెళ్లి సహాయక చర్యలు అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సిబ్బంది కొరత వల్ల విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఉన్న అరకొర సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. ఫైర్ కాల్స్‌కి హాజరయ్యే క్రమంలో స్టేషన్‌ని కని పెట్టుకుని ఉండేందుకు సిబ్బంది కరువవుతున్నారు. కాగా, గత ఏడాది ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు మొత్తంగా 27 ఫైర్‌కాల్స్ నమోదయ్యాయి. ఈ ఏడాది ఒక్క ఏప్రిల్ నెలలోనే ఇప్పటివరకు పదిహేను ప్రమాదాలు నమోదైనట్లు చెప్పారు. ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో తరచూ ఎక్కడో ఒక చోట అగ్నిప్రమాదాలు సంభవించడం జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే సిబ్బంది సేవలు ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఇక్కడి సిబ్బంది కొరతపై దృష్టి సారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## పురుగులు మందులు లేని సాగుపై అవగాహన

**అచ్యుతాపురం, ఏప్రిల్ 29:** సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని గుంటూరు ఏపీ బయోవర్సిటీ బోర్డు ఐసీఆర్‌పీ కరణం వెంకటరమణ అన్నారు. సోమవారం హరిపాలెంలో విద్యార్థులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని అంతా భద్రపరచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగులు మందులు లేని సేంద్రియ ఎరువుల తయారీని వివరించారు. ఈ కార్యక్రమంలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి సిబ్బంది, అనకాపల్లి ఏఎంఏఎల్ బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బరిలో నిలిచేది వీరే..

... 5వ పేజీ తరువాయి

రమేశ్‌బాబు(జనసేన), అన్నంరెడ్డి అదీప్‌రాజ్ (వైసీపీ), కాంగ్రెస్ అభ్యర్థిగా పిరిడి భగత్ బరిలో ఉన్నారు.

**అన్నిచోట్ల కూటమి, వైసీపీ మధ్యే పోరు**

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగుచోట్ల టీడీపీ అభ్యర్థులు, మూడు చోట్ల జనసేన అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు, వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య హోరాహోరీ పోరు ఉంది. పాయకరావుపేట (ఎస్సీ) నియోజకవర్గంలో కూటమి తరఫున టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత పోటీ చేస్తున్నారు. ఆమెపై వైసీపీ తరఫున విజయనగరం జిల్లా రాజాం వైసీపీ ఎమ్మెల్యే కంబాల జోగులు పోటీలో ఉన్నారు. చోడవరం టీడీపీ అభ్యర్థిగా కేఎస్‌ఎన్‌ఎస్ రాజు పోటీలో ఉంటే, ఆయనపై సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పోటీలో నిలిచారు. మాడుగుల నుంచి టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ మూర్తి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తుండగా, వైసీపీ తరఫున బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనురాధ పోటీ చేస్తున్నారు. అనకాపల్లి అసెంబ్లీ నుంచి కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పోటీ చేస్తుండగా, ఆయనపై వైసీపీ అభ్యర్థిగా మలసాల భరత్ తలపడనున్నారు. ఎలమంచిలి నుంచి కూటమి తరఫున జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్ పోటీలో నిలిచారు. ఆయనపై వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు తలపడుతున్నారు. పెందుర్తి నుంచి కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేశ్, ఆయనపై వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు పోటీ పడుతున్నారు. ఇక నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నా, ప్రధానమైన పోటీ కూటమి, వైసీపీ మధ్య ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## పేలవంగా జగన్ సభ

... 5వ పేజీ తరువాయి

గోవాడకు, ఈ ప్రాంత రైతాంగానికి భరోసా ఇచ్చే విధంగా సీఎం నుంచి గట్టి హామీ లభిస్తుందని ఎదురుచూసిన వారికి నిరాశే ఎదురైందని చెప్పాలి. ఇక ప్రధానంగా సాగునీటి వనరుల అభివృద్ధి గురించి కనీస ప్రస్తావన తీసుకు రాకపోవడం, ఈ ప్రాంత రైతాంగం ఎదురుచూస్తున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి గానీ పెద్దేరు, కల్యాణపులోవ, కోనాం,. రైవాడ రిజర్వాయర్ల అభివృద్ధి గురించి ఏమాత్రం సీఎం మాట్లాడకపోవడం స్థానికులను నిరాశకు గురిచేసింది. సీఎం జగన్ కేవలం తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించి, ప్రతిపక్షం అధికారంలోకి వస్తే ఇవేమీ అందవని ప్రజలను భయపెట్టడమే అజెండాగా ప్రసంగం సాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**సీఎం ప్రసంగానికి స్పందన కరువు**

సుమారు 45 నిమిషాల పాటు సాగిన సీఎం ప్రసంగంలో గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలైన చోడవరం, మాడుగుల ప్రజలకు ఊరట ఇచ్చే విధంగా ఎలాంటి హామీలు లేకపోగా, చివరి నిమిషంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీలను పరిచయం చేస్తూ వారికి ఓటేసి గెలిపించాలని కోరి సభను ముగించడంతో సభకు హాజరైన జనం నుంచి స్పందన కరువైంది. చోడవరం, మాడుగులకు ఏం చేశామో?, ఏం చేస్తామో కూడా ప్రస్తావన లేదు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో అమలు చేయలేదని, తాము సంపూర్ణంగా హామీలు అమలు చేశామంటూ గట్టిగా మాట్లాడినప్పటికీ ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. రాయలసీమ యాసలో సీఎం జగన్ మాట్లాడిన మాటలు చాలా వరకు స్థానికులకు అర్థం కాకపోవడంతో జనం స్పందించలేదు. జగన్ సభతో జనంలో ఊపు వస్తుందని ఆశించిన అధికార పార్టీ నేతలకు ఆశాభంగం కలిగిందని పలువురు చర్చించుకుంటున్నారు.

**వాహనాల్లో జనం తరలింపు**

సీఎం జగన్ సభకు వైసీపీ నాయకులు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఆటోలు, వ్యాన్లు, బస్సుల్లో జనాన్ని తరలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆటోలు స్థానిక గాంధీగ్రామం, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోనూ, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోనూ నిలిపి ఉంచారు. అయితే ఎండ ఎక్కువగా ఉండడంతో చాలా మంది వాహనాల్లోనే ఉండిపోయారు.

**దుకాణాలను మూయించిన పోలీసులు**

పట్టణంలో నిర్వహించిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ స్థానిక వ్యాపారులతో పాటు, వాహనదారులకు సంకటంగా మారింది. జగన్ సభ నిర్వహించిన కొత్తూరు జంక్షన్‌తో పాటు ప్రధాన రహదారి, కొత్తూరు జంక్షన్ నుంచి ఇటు దేవరాపల్లి, అటు పీఎస్‌పేట రోడ్డులో చాలా వరకు దుకాణాలను పోలీసులు మూసివేయించారు. అసలే వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉన్న ఈ సమయంలో ఎన్నికల ప్రచార సభ కోసం తమ దుకాణాలను మూసివేయించి తమ కడుపు కొట్టడమేమిటంటూ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక సభ జరిగిన కొత్తూరు జంక్షన్‌లో ప్రధాన రహదారిని పూర్తిగా బారికేడ్లతో మూసివేయించి ఎవరినీ అనుమతించకపోవడం, ప్రధాన రహదారిపై ఉదయం 8 గంటల నుంచే వాహనాలను అనుమతించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక చోడవరంలో సీఎం సభ ప్రారంభానికి రెండు గంటల ముందు నుంచే పాడేరు- చోడవరం రూట్లో వడ్డాది వద్ద, చోడవరం- విశాఖ- అనకాపల్లి రూట్లో వెంకన్నపాలెం జంక్షన్ వద్ద బస్సులు, ఇతర వాహనాలను నిలిపివేయడంతో సుమారు నాలుగు గంటల పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేవలం జగన్ సభకు వచ్చే కార్యకర్తల వాహనాలు మినహా మిగిలిన వాహనాలను నిలిపివేయడంతో ఇతర ప్రాంతాల ప్రజలతో పాటు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

# మిగిలింది వీరే.. ఇక ప్రచారం హోరే..!



పార్టీల గుర్తులు కేటాయింపు సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్‌వో జయరాం సమావేశం

- నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ఖరారు
- వివరాలు వెల్లడించిన రిటర్నింగ్ ఆఫీసర్లు
- నర్సీపట్నంలో 8 మంది.. చోడవరంలో 6గురు.. మాడుగులలో 9 మంది

**నర్సీపట్నం, ఏప్రిల్ 29 :** సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారంతో ముగిసింది. చివరకు నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో మిగిలిన అభ్యర్థుల జాబితాలను ఆయా రిటర్నింగ్ ఆఫీసర్లు జయరాం, చిన్నికృష్ణ, సత్యవేణిలు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీల గుర్తులు కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

నర్సీపట్నం స్థానానికి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సహా ఎనిమిది మంది బరిలో మిగిలారు. ఈ నెల 18 నుంచి 25 తేదీ వరకు ఈ నియోజకవర్గంలో పది మంది అభ్యర్థులు 22 సెట్లు నామినేషనేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 26 తేదీన జరిగిన నామినేషన్లు పరిశీలనలో టీడీపీ, వైసీపీ ప్రధాన అభ్యర్థులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పెట్ల ఉమాశంకర్ గణేశ్ నామినేషన్లు ఆమోదం పొందడంతో టీడీపీ తరఫున డమ్మీ అభ్యర్థిగఆ నామినేషన్ దాఖలు రాజేశ్, వైసీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన కళావతి పత్రాలు తిరస్కరించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనతరం పోటీలో ఎనిమిది మంది ఉన్నారు.

**పోటీ చేస్తున్న అభ్యర్థులు వీరే**

నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం చింతకాయల అయ్యన్నపాత్రుడు (టీడీపీ), పెట్ల ఉమాశంకర్ గణేశ్ (వైసీపీ), రుత్తల శ్రీరామమూర్తి (కాంగ్రెస్), బొట్టా నాగరాజు ( బీఎస్పీ), నేతల నాగేశ్వరరావు (జై భీం రావు భారత్), జోగా చంద్రమౌళి (భారత చైతన్య యువజన), స్వతంత్ర అభ్యర్థులు బయపురెడ్డి భద్రాచలం, ఫైలా సూర్యగణేశ్ ఎన్నికల బరిలో ఉన్నారు.

**చోడవరం బరిలో ఆరుగురు అభ్యర్థులు**

**చోడవరం, ఏప్రిల్ 29 :** నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం చోడవరం అసెంబ్లీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు రంగంలో మిగిలారు. వీరిలో కేఎస్ఎన్‌ఎస్ రాజు (టీడీపీ), కరణం ధర్మశ్రీ (వైసీపీ), జగతా శ్రీనివాసరావు (కాంగ్రెస్), వేగి మహాలక్ష్మినాయుడు (బీఎస్పీ), సవరాల గణేష్ ( సీపీఐ ఎంఎల్ లిబరేషన్), పేరిచర్ల వివేకరాజు (ఇండిపెండెంట్)లు పోటీలో ఉన్నారు.

**మాడుగుల స్థానానికి తొమ్మిది మంది**

**మాడుగుల, ఏప్రిల్ 29 :** మాడుగుల అసెంబ్లీ స్థానానికి సంబంధించి తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. నామినేషన్ల దాఖలు చివరి తేదీ నాటికి మొత్తం 14మంది అభ్యర్థులు 29 నామినేషన్లు దాఖలు చేశారు. కాగా, 26వ తేదీన జరిగిన నామినేషన్ల పత్రాల పరిశీలనలో ప్రధాన పార్టీలకు డమ్మీలుగా వేసిన ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లను ఆర్‌వో తిరస్కరించారు. మిగిలిన 11మంది అభ్యర్థుల్లో ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన గవిరెడ్డి రామానాయుడు, ఫైలా ప్రసాదరావులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బండారు సత్యనారాయణ మూర్తి (టీడీపీ), ఈర్లె అనురాధ (వైసీపీ), బొడ్డు బుచ్చి సత్యశ్రీనివాసరావు (కాంగ్రెస్), బూడి రవి కుమార్ (ఇండిపెండెంట్), మల్లారపు లోవ(ఇం డిపెండెంట్), మాతల ఆరినాయుడు (ఇండిపెండెంట్), తిరుపతిరావు కరణం (బహుజన సమాజ్ పార్టీ), తాళ్ల రవి (నవభారత నిర్మాణ సేవా పార్టీ), లెక్కల ఈశ్వరరావు (జైభీంరావు భారత పార్టీ) బరిలో మిగిలారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల్లో ముందంజ

- ఆ పార్టీకి మళ్లీ ఓట్లు వేస్తే మరింత నష్టం
- కూటమి అభ్యర్థులను గెలిపిస్తే జిల్లా అభివృద్ధి : ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



తిరువోలు ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

**చీడికాడ, ఏప్రిల్ 29 :** వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల్లో ముందంజలో ఉందని కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. మండలంలోని చుక్కపల్లిలో సోమవారం రాత్రి రోడ్డు షో నిర్వహించిన అనంతరం తిరువోలులో భారీ సభలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ప్రజలకు నవరత్నాల పథకాలను అందిస్తున్నామని గొప్పలు చెప్పడమే తప్ప, ఒరిగింది ఏమీ లేదన్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో మాడుగుల నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉందన్నారు. ఇక్కడ పదవిలో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.ఒకవేళ ఆయన ఎంపీ అయితే పార్లమెంట్‌లో ఏ భాషలో మాట్లాడగలరని విమర్శించారు. మొన్న అనకాపల్లి, నేడు చోడవరం సభలకు వచ్చిన సీఎం జగన్‌రెడ్డి బూడికి మాట్లాడే అవకాశం కల్పించలేదంటే దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చునన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రధాని మోదీ ఆశీస్సులతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. ఈ ఎన్నిల్లో తనకు కమలం గుర్తుపై, బండారు సత్యనారాయణకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు ఫైలా ప్రసాదరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ సింహాచలంనాయుడు, రెడ్డి సన్యాసినాయుడు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## వాలాబులో మలేరియా అదుపునకు అధికారులు చర్యలు

- ప్రతి ఇంటికి దోమల మందు స్ప్రేయింగ్
- పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారిణి

**దేవరాపల్లి, ఏప్రిల్ 29 :** మండలంలోని వాలాబు పంచాయతీలో మలేరియా కేసులు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు జోనల్ మలేరియా అధికారిణి ఎం.శాంతి ప్రభ దోమల నివారణకు సోమవారం గ్రామంలో మందును స్ప్రే చేయించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. అంతా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. జర్వం వచ్చిన వెంటనే సమీపంలో ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు పొందాలన్నారు. ముఖ్యంగా ఇళ్ల వద్ద తాగిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, డ్రింక్ బాటిళ్ల వంటివి లేకుండా చూసుకోవాలన్నారు. అవి ఉంటే వాటిలో దోమలు గుడ్లుపెట్టి వాటి సంఖ్యను మరింత పెంచుకునే ప్రమాదం ఉందన్నారు. జ్వరపీడితుల ఆస్పత్రులకు వస్తే వారికి రక్తపరీక్షలు జరపాలని ఆమె దేవరాపల్లి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు రమణ, తిరుపతిరావు, హెల్త్ అసిస్టెంట్ కె.గోవింద రావు, కృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## 'మస్తర్లలో అవకతవకలు జరిగితే చర్యలు'



తూటిపాలలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

**మాకవరపాలెం, ఏప్రిల్ 29 :** ఉపాధి హామీ పనులు చేసే కూలీల మస్తర్ల విషయంలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని ఎంపీడీవో చంద్రరావు సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం తూటిపాల, బూరుగుపాలెం గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. చెరువు పనులు చేస్తున్న కూలీల మస్తరు షీటుపై ఆరా తీశారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.

**విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ**



వ్యవసాయ సాగులో సమస్యలు తెలుపుతున్న గ్రామస్థులు

**చీడికాడ, ఏప్రిల్ 29 :** విత్తనశుద్ధి ద్వారా పంటలకు సోకే తెగుళ్లను నివారించ వచ్చునని శ్రీకాకుళం నైరా కళాశాల, ఎన్‌జీరంగ కళాశాల విద్యార్థులు సూచించారు. చెట్టుపల్లిలో సోమవారం రైతులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం నువ్వు పంటకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నువ్వు సాగుచేసుకునే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు వైఎల్‌ఎం 66 రకాన్ని ఎంపిక చేసుకోవాలన్నారు. ముందుగా ఈ విత్తనాలను శుద్ధి చేసుకుంటే సత్ఫలితాలను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్, డాక్టర్ కిషోర్ కుమార్, మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్.జోగుంపేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వినూత్న ఆందోళన

- గుర్రాలతో నిరసన తెలియజేసిన నేరేడుబంద ఆదివాసీలు



గుర్రాలతో నిరసన తెలుపుతున్న నేరేడుబంద ఆదివాసీలు

**రావికమతం, ఏప్రిల్ 29 :** ఓటింగ్‌కు అన్ని సౌకర్యాలు ఉన్న జెడ్.జోగుంపేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని నేరేడుబంద గ్రామ ఆదివాసీలు సోమవారం గుర్రాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ పరిధిలో 19గిరిజన శివారు గ్రామాలు ఉన్నాయన్నారు. వీటిలో ఉన్న ఓటర్లం ఓటును వేసేందుకు పది నుంచి పదిహేను కిలో మీటర్ల దూరంలో ఉన్న చీమలపాడు, ములకాలపల్లి పోలింగ్ బూత్‌లకు కొండకోనలు, రాళ్లురప్పలు దాటుకుంటూ కాలినడకన దిగి వచ్చి ఓటువేయాల్సి వస్తుందన్నారు. దీంతో ప్రతి ఎన్నికల్లో చాలామంది వరకు ఓటు హక్కును వినియోగించుకో లేకపోతున్నారని వాపోయారు. మూడు కిలో మీటర్ల వ్యవధిలో గల జెడ్.జోగుంపేటలో అన్ని సౌకర్యాలు ఉన్నందున అక్కడ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు గత నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ఫలితం లేకపోయిందన్నారు. జెడ్.జోగుంపేటకు మూడు కిలో మీటర్ల దూరంలో రాయిపాడు, పెదగరువు, అజయ్‌పురం, రొచ్చుపణుకు, నేరేడుబంద, కడగెడ్డ, బంగారుబందల, తాటిపర్తి ఆదివాసీ గ్రామాలకు చెందిన 800 ఓటర్లం ఉన్నామన్నారు. తామంతా ఓటు వేసేందుకు జెడ్.జోగుంపేటలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు, పీవీటీజీ గిరిజన సంఘం నాయకులు కిలో పొట్టుదొర, డిప్పల అప్పారావు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## సంతలో కూరగాయలు విక్రయిస్తూ..

- సీఎం రమేశ్ భార్య శ్రీదేవి ప్రచారం



సంతలో కూరగాయలు అమ్ముతున్న సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి

**ఎస్.రాయవరం, ఏప్రిల్ 29:** మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంతలో బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సతీమణి శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతలో ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి వ్యాపారస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా కూరగాయలను విక్ర యించారు. ఎన్నికల్లో బీజేపీ ఎంపీగా పోటీ చేస్తున్న తన భర్త రమేశ్‌కు కమలం గుర్తుపైన, టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని శ్రీదేవి కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజు, మండల అధ్యక్షుడు బి. జోగునాయుడు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## రారెత్తిస్తున్న ఎండలు

- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం పది దాటితే బయటకు వచ్చేందుకు జనం హడల్



ఎండ ధాటికి నిర్మానుష్యంగా ఉన్న రావికమతంలోని బీఎన్ రోడ్డు



సందడి లేని కృష్ణాదేవిపేటలోని సంత ప్రాంతం

**రావికమతం/కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 29 :** ఎండలు రోజు రోజుకు రారెత్తిస్తున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడు భగభగమంటున్నారు. దీంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీనికితోడు వడగాల్పులు మరింత భయపెడుతున్నాయి. ఉదయం పది గంటలు దాటాక చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణిల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. గత వారం రోజులుగా రావికమతంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇదిలావుంటే, గొలుగొండ మండలంలో ఎండల ప్రభావం పెరుగుతోంది. ఫలితంగా సోమవారం కృష్ణాదేవిపేటలో జరిగిన వారపు సంత బోసిపోయి కనిపించింది. సంతకు వివిధ రకాల సరకులను వ్యాపారులు తెచ్చినా కొనుగోలు చేసేవారు చాలా మంది వరకు కరువయ్యారు. ఎండల ధాటికి ప్రధాన రహదారులు బోసిపోయి కనిపిస్తున్నాయి.

## నగరం, కేఎల్‌పురం గ్రామాల్లో పారిశుధ్య సమస్య



నగరంలో ఇళ్ల మధ్య పెంటకుప్పలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

**నర్సీపట్నం అర్బన్, ఏప్రిల్ 29 :** మండలంలోని నగరం, కేఎల్ పురం గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. ఈ రెండు గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు రోడ్లపైకి చేరుతోంది. అది మురుగుగా మారి మరిన్ని సమస్యలకు కారణమవుతోంది. అలాగే ఎక్కడికక్కడ చెత్తా చెదారం దర్శనమిస్తోంది. దీంతో దుర్వాసన కారణంగా ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు ఈగలు, దోమల బెడద అధికమైందని వాపోతున్నారు. ఈ కారణంగా రాత్రివేళ కంటిపై కునుకు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సరిగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని అంటున్నారు. అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకు వెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిందిగా కోరుతున్నారు.



కేఎల్ పురంలో రోడ్డుపైకి చేరిన మురుగు